మీరే
చదువరి..
క్యూఆర్ కోడ్
స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త
వార్తలు చదవండి...


# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక


మీరే
విలేకరి..
క్యూఆర్ కోడ్
స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని
వార్తలు పంపండి..

ఆదివారం THURSDAY 2-11-2025 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 || సంచిక: 123 Issue: 123

Published from Jagitial
www.evarthalu.com

02 నవంబర్ 2025 - ఆదివారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయనం - శరత్ ఋతువు కార్తీక మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:18 సూర్యాస్తమయం - సా. 5:40 తిథిః ఏకాదశి ఉ. 7:30 వరకు తరువాత ద్వాదశి తె. 5:07o వరకు సంస్కృత వారం భాను వాసరః నక్షత్రం పూర్వాభాద్ర సా. 4:49 వరకు తరువాత ఉత్తరాభాద్ర యోగం వ్యఘతా రా. 11:01 వరకు కరణం విష్టి ఉ. 7:30 వరకు బవ సా. 6:18 వరకు వర్జ్యం రా. 1:52 నుండి తె. 3:20 వరకు దుర్ముహూర్తం సా. 4:09 నుండి సా. 4:55 వరకు రాహుకాలం సా. 4:15 నుండి సా. 5:40 వరకు యమగండం ఉ. 11:59 నుండి మ. 1:24 వరకు గుళికాకాలం మ. 2:50 నుండి సా. 4:15 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:42 నుండి తె. 5:30 వరకు అమృత ఘడియలు ఉ. 9:28 నుండి ఉ. 10:59 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:36 నుండి మ. 12:22 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున

## డబుల్ కిక్




ఆదివారం రెండు ఇండియా క్రికెట్ మ్యాచ్‌లు ఫ్యాన్స్ కు డబుల్ కిక్ ఇవ్వనున్నాయి. ఇండియా మహిళల వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్ తో పాటు మెన్స్ జట్టు టీ20 మ్యాచ్ ఆడనుంది. ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా ఇండియా మూడో టీ20 మ్యాచ్ ఆడనుంది. ఈ మ్యాచ్ మధ్యాహ్నం 1:45 గంటలకు మ్యాచ్ జరుగుతుంది. మ్యాచ్ జియో హాట్ స్టార్ లో లైవ్ స్ట్రీమింగ్ అవుతుంది. ఇక లైవ్ టెలికాస్ట్ విషయానికి వస్తే స్టార్ స్పోర్ట్స్ నెట్ వర్క్ లో ప్రత్యక్ష ప్రసారం చూడొచ్చు. మరోవైపు, మహిళల వరల్డ్ కప్ ఫైనల్‌లో ఇండియా సౌతాఫ్రికాతో తలపడనుంది. ఈ గ్రాండ్ ఫైనల్ ముంబైలోని డాక్టర్ డివై పాటిల్ స్పోర్ట్స్ అకాడమీలో జరుగుతుంది. మ్యాచ్ మధ్యాహ్నం 3:00 గంటలకు ప్రారంభమవుతుంది.




## జీఎస్టీ హెూరు..

అక్టోబర్‌లో జీఎస్టీ వసూళ్లు రికార్డు స్థాయిలో నమోదయ్యాయి. దాదాపు రూ.1.95లక్షల కోట్లు జీఎస్టీ వసూళ్లయ్యాయి. గతేడాది ఇదే నెలతో పోలిస్తే 4.6శాతం పెరిగాయి. 2024 అక్టోబర్ మాసంలో జీఎస్టీ వసూళ్లు రూ.1.87లక్షలుగా ఉన్నాయి. సెంట్రల్ జీఎస్టీ, స్టేట్ జీఎస్టీ, ఇంటిగ్రేటెడ్ జీఎస్టీ అన్నీ అక్టోబర్ నెలలో వృద్ధిని నమోదు చేయగా.. సెస్ వసూళ్లు మాత్రం తగ్గాయి.

## యూపీఐ జోరు..

దేశంలో యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ వినియోగం అప్రతిహతంగా కొనసాగుతోంది. అక్టోబర్ నెలలో యూపీఐ లావాదేవీలు మరోసారి సరికొత్త రికార్డు స్థాయికి చేరాయి. ఈ నెలలో మొత్తం 20.70 బిలియన్ (2070 కోట్లు) లావాదేవీలు జరిగాయని నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా శనివారం విడుదల చేసిన గణాంకాలు వెల్లడించాయి.




## కల్కి ట్రీట్



సినీ రంగంలో ప్రతిష్టాత్మకంగా భావించే 'దాదా సాహెబ్ ఫాల్కే ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్' ముంబైలో అట్టహాసంగా జరిగింది. 2024లో అత్యుత్తమ కనబరిచిన సినిమాలు, వెబ్ సిరీసులు, నటీనటులు, సాంకేతిక నిపుణులకు అవార్డులు అందజేశారు. ప్రభాస్ హీరోగా నటించిన 'కల్కి 2898 ఏడీ' సినిమా బెస్ట్ ఫిల్మ్ ఆఫ్ ది ఇయర్‌గా ఎంపికైంది. ఉత్తమ చిత్రంగా 'స్త్రీ 2' పురస్కారం అందుకోగా.. 'చందు ఛాంపియన్' సినిమాకిగాను బెస్ట్ డైరెక్టర్ గా కబీర్ ఖాన్ నిలిచారు. ఉత్తమ నటుడిగా కార్తిక్ ఆర్యన్ (చందు ఛాంపియన్), ఉత్తమ నటిగా కృతిసనన్ అవార్డులు సాధించారు.



## 85 శాతం మెడికల్ పీజీ సీట్లు తెలంగాణవాళ్లకే

మెడికల్ పీజీ మేనేజ్‌మెంట్ కోటా సీట్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. ఏకంగా85 శాతం తెలంగాణ విద్యార్థులకే ఇవ్వాలని రేవంత్ రెడ్డి సర్కారు నిర్ణయించింది.

హైదరాబాద్, నవంబర్ 1 (ఈవార్తలు): ఇప్పటివరకూ మేనేజ్‌మెంట్ కోటా సీట్లన్నీ ఆల్ ఇండియా కేటగిరీలో భర్తీ చేసేవారు. కానీ ఇక మీదట 85 శాతం సీట్లు తెలంగాణ బిడ్డలకే ఇవ్వాలని రేవంత్ రెడ్డి సర్కార్



## బంగారం-వెండి ధరలు



| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.12,300 |
| వెండి (గ్రాము): | రూ.166 |
| ప్లాటినం (గ్రాము): | రూ.4,481 |

# సొంత బావ ఫోన్ ట్యాప్

### కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు

జాగృతి అధ్యక్షురాలు కవిత బీఆర్ఎస్ పార్టీపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. శనివారం కరీంనగర్ లో పర్యటించిన కవిత ఈమేరకు సంచలన వ్యాఖ్యలు చేశారు. పార్టీలో తనకు అవమానం జరిగింది కాబట్టే బయటికి వచ్చానని..అన్యాయం జరిగినా భరించేదాన్నని అన్నారు. ఫోన్ ట్యాపింగ్ వార్త వినగానే కడుపులో దేవినట్లయ్యిందని అన్నారు. సొంత బావ ఫోన్ ఎవరైనా ట్యాప్ చేస్తారా అని ఆవేదన వ్యక్తం చేశారు కవిత. ఆత్మగౌరవం కోసమే పార్టీ నుంచి బయటికి వచ్చానని.. బీఆర్ఎస్ లో చాలామంది నేతలు, ఉద్యమకారులు అసంతృప్తితో ఉన్నారని అన్నారు కవిత. బీఆర్ఎస్ వీడి జనంబాట పట్టాక బీఆర్ఎస్ నేతలు చాలామంది తనతో టచ్ లోకి వచ్చారని అన్నారు.

### పార్టీలో అవమానం వల్లే బయటికి వచ్చా... బీఆర్ఎస్‌లో చాలా మందిలో అసంతృప్తి

### వాళ్లంతా నాతో టచ్‌లో ఉన్నారు.. కల్వకుంట్ల కవిత వ్యాఖ్యలు

కరీంనగర్, నవంబర్ 1 (ఈవార్తలు): జనంబాటలో భాగంగా పాత క్యాడర్ తనతో మాట్లాడుతున్నారని అన్నారు. కరీంనగర్ జిల్లా పరిధిలో పాద-యాత్ర ఉత్సాహంగా కొనసాగుతోందని, ప్రజల నుంచి విశేషమైన స్పందన వస్తోందని కవిత పే-ర్కొన్నారు. "సామాజిక తెలంగాణ నిర్మాణం కోసం అన్ని వర్గాల వారినీ కలుపుకొని ముందుకు సాగు-తున్నాం. విద్య, వైద్యం వంటి కీలక అంశాలు ఇంకా జనాల మధ్య లోతుగా చేరాల్సి ఉంది," అని కవిత తెలిపారు. సింగరేణి సంస్థను కాపాడడంలో మాజీ సీఎం కేసీఆర్ కీలక పాత్ర పోషించారని గుర్తుచేసిన ఆమె, ఆర్టీసీ విభాగంలో ఉన్న సమస్యలపై విప్లవా-త్మక ఆలోచన అవసరమని సూచించారు. "సామా-జిక తెలంగాణను సాకారం చేయడం మనందరి బాధ్యత," అని అన్నారు. "తెలుగు భాషకు ప్రాచీన హోదా రావడానికి మనం అందరం కృషి చేశాం. కానీ కరీంనగర్ జిల్లాలో రోడ్ల పరిస్థితి చాలా దయ-నీయంగా తరువాయి 2 వ పేజీలో...


# కాశీబుగ్గ.. బతుకులు బుగ్గి

### శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో తొక్కిసలాట

### 10 మంది దుర్మరణం.. పదుల సంఖ్యలో గాయాలు

### పెద్ద ఎత్తున భక్తులు తరలిరావడంతోనే ఘటన





శ్రీకాకుళం, నవంబర్ 1 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం ఆలయంలో ఘోర విషాదం చోటు చేసుకుంది. కాశీబుగ్గ శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద తొక్కిసలాట జరిగి 10 మంది దుర్మరణం పాలయ్యారు. కార్తీక మాసం ఏకాదశి సందర్భంగా వైష్ణవ ఆరాధన కోసం ఒక్కసారిగా భక్తులు పోటెత్తారు. ఎక్కువ సంఖ్యలో భక్తులు అంచనాకు మించి రావడంతో ఈ ఘోర విషాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో పలువురు తీవ్రంగా గాయపడ్డారు. దేవాలయ సామర్థ్యం 3 వేలు కాగా ఏకంగా 25 వేల మంది భక్తులు తరలి రావడంతోనే ఈ ఘోర దుర్ఘటన చోటుచేసుకుంది. కార్తీక మాసం, అందులోనూ ఏకాదశి శనివారం రోజు కలిసి -2 వ పేజీలో...

## విశ్వవాణి



సముద్రపు నీటిని తాగునీటిగా మార్చే డీసాలినేషన్ ప్లాంట్‌ను దుబాయ్ ఏర్పాటు చేయ-ంబోతోంది. ఇది ప్రపంచంలో అతి పెద్ద సోలార్ ప్రాజెక్టు. ఈ ప్లాంట్ ద్వారా దాదాపు ప్రతి రోజు 20 లక్షల మందికి తాగునీటిని అందించనున్నారు. ఈ ప్రక్రియ కోసం ఎలాంటి శిలాజ ఇంధనాలను వాడబోమని దుబాయ్ ప్రభుత్వం పేర్కొంది.

# కేసీఆర్ దుర్మార్గుడు

### పీజేఆర్ చనిపోతే ఎన్నికలు తెచ్చాడు

### రాజకీయ సంప్రదాయాలను కాలరాశాడు

### కారు షెడ్డుకు పోయింది.. ఆటోల్లో బిల్లారంగాలు

### సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్, నవంబర్ 1 (ఈవార్తలు): బీఆరెస్ పార్టీ సానుభూతితో ఓట్లు దండుకోవాలని ప్రయత్ని స్తోందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఎర్రగడ్డ డివిజన్‌లో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో పాల్గొన్న రేవంత్ రెడ్డి బీఆరెస్ పార్టీ తీరుపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలతరువాయి 2 వ పేజీలో...



# రేవంత్ తోక కట్ చేస్తరు

### ఓటేయకపోతే పథకాల రద్దు అంటూ ధమ్కీలు

### 500 రోజుల్లో బీఆర్ఎస్ సర్కారు వస్తుంది

### కేసీఆర్ మళ్లీ సీఎం కాబోతున్నారు

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

జూబ్లీహిల్స్, నవంబర్ 1 (ఈవార్తలు): ఓటు వేయకపోతే పథకాలను రద్దు చేస్తానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధమ్కీలు ఇస్తున్నాడని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసి డెంట్ కేటీఆర్ అన్నారు. రద్దు చేస్తానని ఎగిరెగిరిపడితే ప్రజలు పెట్టే వాతలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఆగమయ్యే రోజు దగ్గరలోనే ఉందని వ్యాఖ్యానించారు. ఇది చైతన్య వంతమైన తెలంగాణ అని తరువాయి 2 వ పేజీలో...






# రాత్రి 11 వరకే మెట్రో

### హైదరాబాద్ మెట్రో కీలక నిర్ణయం

హైదరాబాద్, నవంబర్ 1 (ఈవార్తలు): హైదరాబాద్‌లో మెట్రో రాకతో ఎంతో మంది ఉద్యోగులకు ట్రాఫిక్ చిక్కులు తప్పాయి. నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ దృష్ట్యా చాలా మంది మెట్రో ప్రయాణానికే మొగ్గు చూపుతున్నారు. దీంతో మెట్రోలో రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఈ నేపథ్యంలో మెట్రో రైలు ప్రయాణ వేళల్లో కీలక మార్పులు జరిగాయి. నవంబర్ 3 నుంచి ఈ కొత్త సమయాలు అమలులోకి రానున్నాయి. మెట్రో రైలు సంస్థ ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించింది. ఇకపై ఉదయం 6:00 గంటల నుంచి 11:00 గంటల వరకు -2 వ పేజీలో...

# ఈడబ్ల్యూఎస్ లాగే బీసీ రిజర్వేషన్

### జస్టిస్ సుదర్శన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు

హైదరాబాద్, నవంబర్ 1 (ఈవార్తలు): రాజ్యాంగ సవరణ చేసి, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు ఎలా ఇచ్చారో బీసీలకు 42 శాతం బిల్లును 9వ షెడ్యూల్‌లో చేర్చాలని జస్టిస్ సుదర్శన్ రెడ్డి అన్నారు. సామాజిక తెలంగాణ నిర్మాణంలో బీసీ రిజర్వేషన్లు ఒక కీలక అడుగు అని ఆయన అన్నారు. తెలంగాణ జనసమితి పార్టీ ఆధ్వర్యంలో బీసీ లకు 42 శాతం రిజర్వేషన్ల సాధనకై సదస్సు టీజేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ పి.ఎల్.విశ్వేశ్వరరావు అధ్యక్షతన శనివారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో జరిగింది. జస్టిస్ చంద్రకుమార్, సీనియర్ జర్నలిస్ట్ రామచంద్ర మూర్తి, ప్రొఫెసర్ కోదండరాం హాజరయ్యారు. ఈ సందర్భంగా జస్టిస్ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ తరువాయి 2 వ పేజీలో...



# ఇంకెప్పుడు బీసీ రిజర్వేషన్!

### ఇప్పుడు సాధ్యం కాకపోతే ఎన్నడూ కాదు

### ఢిల్లీకి వెళ్లి న్యాయం చేయాలని కోరుదాం

### కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్ వెల్లడి



2

## రాశి ఫలాలు

2.11.2025

మేషం: ఆర్థిక లావాదేవీలు ఆశాజనకంగా ఉంటాయి. ముఖ్యమైన వ్యవహారాలలో అనుకూలంగా సాగుతాయి. విందు, వినోద కార్యక్రమాలలో పాల్గొంటారు. ఉద్యోగాలలో హెూదాలు పెరుగుతాయి. సంతానం పోటీపరీక్షల్లో విజయం సాధిస్తారు. దూరపు బంధువుల నుంచి శుభవార్తలు అందుతాయి.

వృషభం: వృత్తి, వ్యాపారాలలో కొంత మందకోడిగా సాగుతాయి. ముఖ్యమైన వ్యవహారాలలో జీవిత భాగస్వామి సలహాలు తీసుకుని ముందుకు సాగడం మంచిది. విలువైన వస్తువులు విషయంలో జాగ్రత్త అవసరం. వివాదాలకు దూరంగా ఉండాలి. గృహ నిర్మాణ ఆలోచనలు నిదానిస్తాయి.

మిథునం: విలువైన వస్త్రా, ఆభరణాలు కొనుగోలు చేస్తారు. కుటుంబ సభ్యుల నుండి కొత్త విషయాలను తెలుసుకొంటారు. వృత్తి, వ్యాపారాలలో నూతన ప్రోత్సాహకాలు అందుతాయి. ఉద్యోగులల్లో చిక్కులు తొలగుతాయి. ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. సంఘంలో గౌరవ మర్యాదలకు లోటు ఉండదు.

కర్కాటకం: ఉద్యోగులకు శుభవార్తలు అందుతాయి. గృహమున సంతాన శుభకార్య విషయమై ప్రస్తావన వస్తుంది. నూతన ఉద్యోగ యత్నాలు సాగిస్తారు. ఆర్థిక వ్యవహారాలు అనుకూలిస్తాయి. నూతన భూ వాహనాలు కొనుగోలు చేస్తారు. వృత్తి, వ్యాపారాలు గతం కంటే మెరుగువుతాయి.

సింహం: వివాదాలకు వీలైనంత దూరంగా ఉండటం మంచిది. చేపట్టిన పనులలో జాప్యం జరిగినా సకాలంలో పూర్తి చేస్తారు. వృత్తి వ్యాపారాలలో స్వల్ప లాభాలు అందుతాయి. ఆప్తుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్న అవసరాలకు ధన సహాయం అందుతుంది.

కన్య: ఉద్యోగులకు అదనపు బాధ్యతలు పెరిగినా సమర్థవంతంగా పూర్తిచేస్తారు. బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కార దశకు చేరుకుంటాయి. విలువైన వస్తువులు బహుమతులుగా పొందుతారు. చేపట్టిన పనులలో విజయం సాధిస్తారు. వాహన ప్రయాణ విషయాలలో కొంత జాగ్రత్త అవసరం.

తుల: వృత్తి, వ్యాపారాలలో ఉత్సాహంగా సాగుతాయి. నిరుద్యోగుల ఆశలు ఫలిస్తాయి. ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. సంతన వివాహయత్నాలు అనుకులిస్తాయి. ఉద్యోగమున అధికారుల అనుగ్రహం కలుగుతుంది. చేపట్టిన వ్యవహారాలల్లో విజయం సాధిస్తారు. దీర్ఘకాలిక ఋణాలు తీరి ఊరట చెందుతారు.

వృశ్చికం: వ్యాపారాల విస్తరణకు స్నేహితుల సహాయ/ సహకారాలు పొందుతారు. గృహమున శుభకార్యాల ప్రస్తావన వస్తుంది. ఆర్థిక పురోగతి సాధిస్తారు. నిరుద్యోగులకు ఉద్యోగ యోగం ఉన్నది. దైవ చింతన పెరుగుతుంది. భూ క్రయ విక్రయాలలో తొందరపాటు నిర్ణయాలు చేయడం మంచిది కాదు.

ధనస్సు: వృత్తి, వ్యాపారాలలో విశేషమైన లాభాలు పొందుతారు. ప్రయాణాలలో నూతన పరిచయాలు కలుగుతాయి. సంతాన విద్య ఉద్యోగ యత్నాలు ఫలిస్తాయి. ఆరోగ్య సమస్యలు నుండి ఉపశనం పొందుతారు. కుటుంబ సభ్యులతో గృహమున ఆనందంగా గడుపుతారు.

మకరం: వృత్తి, వ్యాపారాలలో నూతన ప్రోత్సాహకాలు లభిస్తాయి. ప్రయాణాలలో తొందరపాటు మంచిది కాదు. విలువైన వస్త్రా, ఆభరణాలు కొనుగోలు చేస్తారు. దూరపు బంధువుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. చేపట్టిన పనులు నిదానంగా పూర్తి చేస్తారు. మిత్రులతో ఏర్పడిన మాట పట్టింపులు తొలగుతాయి.

కుంభం: వృత్తి, వ్యాపారాలలో ఆశించిన లాభాలు పొందుతారు. ఇంటాబయట అనుకూల వాతావరణం ఉంటుంది. దూర ప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది. ఉద్యోగమున చిన్న పాటి వివాదాలుంటాయి. నూతన కార్యమాలకు శ్రీకారం చుడతారు. స్థిరాస్థి వివాదాలు పరిష్కారమవుతాయి.

మీనం: క్రయవిక్రయాలలో స్వల్పలాభాలు పొందుతారు. చిన్ననాటి మిత్రులతో ఏర్పడిన వివాదాలను పరిష్కారించుకొంటారు. సంతాన విద్యా ఉద్యోగ విషయాలలో శుభవార్తలు అందుకుంటారు. చేపట్టిన పనులలో శ్రమ అధికంగా ఉంటుంది. భూవివాదాలు తీరి లబ్ది పొందుతారు.

# జీఎస్టీ హెూరు..

ముంబై: అక్టోబర్‌లో జీఎస్టీ వసూళ్లు రికార్డు స్థాయిలో నమోదయ్యాయి. దాదాపు రూ.1.95లక్షల కోట్లు జీఎస్టీ వసూళ్లయ్యాయి. గతేడాది ఇదే నెలతో పోలిస్తే 4.6శాతం పెరిగాయి. 2024 అక్టోబర్ మాసంలో జీఎస్టీ వసూళ్లు రూ.1.87లక్షలుగా ఉన్నాయి. సెంట్రల్ జీఎస్టీ, స్టేట్ జీఎస్టీ, ఇంటిగ్రేటెడ్ జీఎస్టీ అన్నీ అక్టోబర్ నెలలో వృద్ధిని నమోదు చేయగా.. సెస్ వసూళ్లు మాత్రం తగ్గాయి. 2025-26 ఆర్థిక సంవత్సరం మొదటి ఏడు నెలల్లో (ఏప్రిల్-అక్టోబర్) మొత్తం జీఎస్టీ వసూళ్లు 9 శాతం వృద్ధిని నమోదు చేశాయి. 2017లో జీఎస్టీని అమలు చేసినప్పటి నుంచి ఇదే అత్యధికం. భారత జీఎస్టీ వ్యవస్థ 2024-25లో రూ.22.08 లక్షల కోట్ల రికార్డు స్థూల వసూళ్లతో మైలురాయిని సాధించింది. ఇదిలా ఉండగా.. అక్టోబర్ నెలలో జీఎస్టీ రూ.1.87 లక్షల కోట్లు వసూలు జరిగాయి. ఆ మొత్తం 1.96 లక్షల కోట్లకు చేరింది. ఈ ఏడాది ఆగస్టులో ఈ మొత్తం రూ.1.86 లక్షలు కోట్లు వసూలవగా.. సెప్టెంబర్‌లో 1.89 లక్షలు కోట్లుగా నమోదైందని ఆర్థికశాఖ గణాంకాలు తెలిపాయి. గతేడాదితో పోల్చినప్పుడు 4.6 శాతం వృద్ధి నమోదైంది. అయితే, గడిచిన నెలలతో పోల్చి చూస్తే సగటున 9 శాతం వృద్ధి కంటే తక్కువ నమోదైంది. అక్టోబర్ జీఎస్టీ వసూళ్లలో రూ.1.45 లక్షల కోట్లు దేశీయ వినియోగం నుంచి.. దిగుమతులపై సుంకాల ద్వారా రూ.50,884 కోట్లు వచ్చాయి. జీఎస్టీ రిఫండ్స్ రూ.26,934 కోట్లు మినహాయిస్తే.. నికర జీఎస్టీ వసూళ్లు రూ.1.69 లక్షల కోట్లుగా నమోదయ్యాయని కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ పేర్కొంది.

# యూపీఐ జోరు..

ముంబై: దేశంలో యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ వినియోగం అప్రతిహతంగా కొనసాగుతోంది. అక్టోబర్ నెలలో యూపీఐ లావాదేవీలు మరోసారి సరికొత్త రికార్డు స్థాయికి చేరాయి. ఈ నెలలో మొత్తం 20.70 బిలియన్ (2070 కోట్లు) లావాదేవీలు జరిగాయని నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా శనివారం విడుదల చేసిన గణాంకాలు వెల్లడించాయి. గతేడాది ఇదే నెలతో పోలిస్తే లావాదేవీల సంఖ్యలో 25 శాతం వృద్ధి నమోదైంది. ఇక లావాదేవీల విలువ పరంగా చూస్తే, అక్టోబర్‌లో రూ.27.28 లక్షల కోట్లుగా నమోదైంది. ఇది గతేడాదితో పోలిస్తే 16 శాతం అధికం. సెప్టెంబర్ నెలలో నమోదైన రూ.24.90 లక్షల కోట్ల విలువ కంటే కూడా ఇది ఎక్కువ కావడం గమనార్హం. ఎన్‌పీసీఐ డేటా ప్రకారం, అక్టోబర్‌లో రోజువారీ లావాదేవీల విలువ సగటున రూ.87,993 కోట్లుగా ఉంది. సెప్టెంబర్‌లో ఈ సంఖ్య రూ.82,991 కోట్లుగా ఉండేది. అలాగే, రోజువారీ లావాదేవీల సంఖ్య కూడా సెప్టెంబర్‌లోని 654 మిలియన్ల నుంచి అక్టోబర్‌లో 668 మిలియన్లకు పెరిగింది. యూపీఐతో పాటు ఇన్‌స్టంట్ మనీ ట్రాన్స్‌ఫర్ లావాదేవీలు కూడా అక్టోబర్‌లో రూ.6.42 లక్షల కోట్లకు పెరిగాయి.

# కేసీఆర్ దుర్మార్గుడు

మొదటి పేజీ తరువాయి

సందర్భంగా నిర్వహించిన ఈ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. బీజేపీ, బీఆరెస్ మధ్య రహస్య ఒప్పందం ఉందని ఆరోపించారు. అప్పుడు పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని గెలిపించేందుకు బీఆరెస్ పనిచేసింది. ఇప్పుడు బీజేపీ వాళ్లు బీఆరెస్ ను గెలిపించేందుకు పనిచేస్తున్నారు. కేంద్రంలో ప్రతీ సందర్భంలో ప్రధాని నరేంద్ర మోదీకి కేసీఆర్ మద్దతు పలికారని విమర్శలు గుప్పించారు. గతంలో పాటించిన రాజకీయ సంప్రదాయాలను కేసీఆర్ తుంగలో తొక్కారని సీఎం రేవంత్ రెడ్డి ధ్వజమెత్తారు. 'సెంటిమెంట్ పేరుతో బీఆరెస్ నేతలు మీ ముందుకు వస్తున్నారు. అయితే, 2007లో పీజేఆర్ గారు ఆకస్మికంగా చనిపోతే, ఆ స్థానాన్ని ఏకగ్రీవం చేయాల్సింది పోయి, అభ్యర్థిని పెట్టి ఎన్నికలు తెచ్చిన దుర్మార్గుడు కేసీఆర్. ఆనాడు పీజేఆర్ కుటుంబాన్ని మూడు గంటలు బయట నిలబెట్టి కేసీఆర్ అవమానించాడు. పీజేఆర్ కుటుంబంపై పోటీ పెట్టి సంప్రదాయాన్ని తుంగలో తొక్కింది కేసీఆర్. కారు షెడ్డుకు పోయిందని ఇప్పుడు బిల్లా రంగాలు ఆటోలలో తిరుగుతున్నారు' అని ఎద్దేవా చేశారు. పదేళ్ల అధికారంలో జూబ్లీహిల్స్ సమస్యల పరిష్కారానికి ఎందుకు కృషి చేయలేదని కేటీఆర్‌ను సీఎం రేవంత్ రెడ్డి సూటిగా ప్రశ్నించారు. జూబ్లీహిల్స్ లో సమస్యలు



పేరుకుపోవడానికి కారణం నువ్వు మీ అయ్య కాదా కేటీఆర్? పదేళ్లు అధికారంలో ఉన్న మీరు సమస్యలు పరిష్కరించి ఉంటే జూబ్లీహిల్స్ కు ఈ పరిస్థితి వచ్చేదా? పదేళ్లు అధికారంలో ఉన్న మీరు మైనారిటీ సమస్యలు ఎందుకు పరిష్కరించలేదు? అని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. సొంత కుటుంబ సభ్యురాలిని దూరం చేసుకున్న కేటీఆర్ తీరుపై విమర్శలు గుప్పించారు. ఆస్తిలో వాటా ఇవ్వాల్సి వస్తుందని సొంత చెల్లెలిని ఇంటి నుంచి పంపిన కేటీఆర్... సునీతమ్మను మంచిగా చూసుకుంటాడా? సొంత చెల్లికి అన్నం పెట్టని వాడు పిన్నమ్మ కూతురికి బంగారు గాజులు పెడతారంటే నమ్ముతారా?" అని సీఎం రేవంత్ రెడ్డి ప్రజలనుద్దేశించి మాట్లాడారు. తమ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ముఖ్యమంత్రి ఈ సందర్భంగా వివరించారు. ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకు 70 వేల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేశాం. ఈ బస్తీల్లో రేషన్ కార్డులు ఇచ్చింది కాంగ్రెస్ కాదా?. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇచ్చి మిమ్మల్ని ఆదుకున్నది కాంగ్రెస్.

## సొంత బావ ఫోన్ ట్యాప్

మొదటి పేజీ తరువాయి

ఉంది. కేంద్ర మంత్రి బండి సంజయ్ గారు ఈ సమస్యలపై దృష్టి పెట్టాలి," అని వ్యాఖ్యానించారు. ఇదిలా ఉండగా.. కరీంనగర్ జిల్లాలో మెంథా తుపానుతో నష్టపోయిన పంటలను స్థానిక రైతులతో కలిసి పరిశీలించారు. తుపాను, నిరంతర వర్షాల కారణంగా రైతులు దారుణంగా నష్టపోయారని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నెల తరబడి కొనుగోళ్లు జరగకపోవడం, వర్షాలతో ధాన్యం తడిసి ముద్దవుతుండటం లాంటి సమస్యలు రైతుల జీవితాలను దయనీయంగా మారుస్తాయని కవిత అన్నారు. ధాన్యం మొలకలు వచ్చి, బూజు పట్టి, తేమ శాతం ఎక్కువగా ఉన్న ధాన్యం కూడా కొనుగోలు చేయాలని కవిత డిమాండ్ చేశారు. ఎకరాకు ప్రభుత్వం రూ.10 వేలు పరిహారం ఇస్తానంటోందని.. అది ఏ మూలకు సరిపోదన్నారు. పంట నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరాకు రూ.50 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.



## కాశీబుగ్గ.. బతుకులు బుగ్గి

మొదటి పేజీ తరువాయి

రావడంతో వెంకన్న స్వామి భక్తులు పెద్ద మొత్తంలో వచ్చారు. దీంతో అక్కడ భక్తులు నిండిపోవడంతో సాధారణ స్థాయిలోని రెయిలింగ్ విరిగి భక్తులు పడిపోయారు. ఒక్కసారిగా గందరగోళ పరిస్థితి ఏర్పడడంతో ఈ తొక్కిసలాట జరిగింది. తొక్కిసలాటతో ఒక్కసారిగా ఆ ప్రాంతమంతా విషాద ఛాయలు అలుముకున్నాయి. పలు కుటుంబాల్లో తీవ్ర విషాదం నింపింది. తల్లితో కలిసి ఆ వేంకటేశుని దర్శించుకోవడానికి వచ్చిన చిన్నారి చనిపోవడం, విగత జీవిగా మారిన బాబు మృతదేహాన్ని చూసి తల్లి రోదించిన తీరు అందరిని కదిలించింది. 'నాన్న లేవురా'.. అంటూ గుండెలు బాదుకొని కొడుకుని ముద్దాడుతూ తల్లడిల్లి పోతున్న దృశ్యం కంటతడి పెట్టిస్తోంది.

## ఈడబ్ల్యూఎస్ లాగే బీసీ రిజర్వేషన్

మొదటి పేజీ తరువాయి

తాను సామాజిక స్పృహ కలిగిన వ్యక్తినని, తాను బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని కాదని అన్నారు. రాజ్యాంగం పట్ల అవగాహన, సమాజంలో ఉన్న పరిస్థితులపై అవగాహన చేసుకొని మాట్లాడే వారు ఎవరినైనా స్వాగతించాలని అన్నారు. దేశంలో కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో సామాజిక న్యాయం కోసం ప్రజా ఉద్యమాలు జరిగాయని గుర్తు చేశారు. రిజర్వేషన్లు అంటే ఉద్యోగాలు, అవకాశాలు కోసం అనేది అపోహ అని అన్నారు. అప్పుడు లేని ప్రస్తావన, ఇప్పుడు రిజర్వేషన్లపై 50 శాతం పరిమితి పెట్టడం హాస్యాస్పదం అన్నారు. సామాజిక న్యాయం కోసం దేశం మొత్తం తిరుగుతున్న రాహుల్ గాంధీ ని ప్రజలు అర్థం చేసుకోవడం లేదని అన్నారు. హైకోర్టు ఎన్నికలు నిర్వహించాలని ఆదేశాలు ఇచ్చిందని, రిజర్వేషన్లు పెంచి ఎన్నికలకు వెళ్లాలని రాష్ట్ర ప్రభుత్వం డెడికేషన్ కమిషన్ వేసిందన్నారు. ప్రభుత్వం బీసీ లెక్కలు తీసి, రిజర్వేషన్లు 42 శాతానికి పెంచి అసెంబ్లీలో తీర్మానం చేసి గవర్నర్ ఆమోదానికి పంపిందని తెలిపారు. గవర్నర్ ఆమోదించక పోవడంతో ప్రభుత్వం జీవో తీసుకురావడంతో హైకోర్టు స్టే విధించిందని అన్నారు. జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్వతంత్రంగా చట్టాలు చేసే అధికారం రాజ్యాంగం కల్పించిందని అన్నారు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం చేసిన చట్టాన్ని గవర్నర్ తొక్కిపెట్టే అధికారం లేదని అన్నారు. ఈబీసీలు 10 శాతం ఇచ్చినప్పుడు 50 శాతం రిజర్వేషన్ల పరిమితి కనిపించకపోవడం బాధాకరం అన్నారు. ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ రిజర్వేషన్ల అమలు వల్ల కుల, మతాలకు అతీతంగా గౌరవ ప్రదమైన జీవనం సమాజంలో దక్కుతుందని అన్నారు. 42 శాతం రిజర్వేషన్ల అమలుకు గట్టిగా నిలబడి ప్రయత్నించాలని అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు తెలంగాణ జన సమితి కట్టుబడి ఉందని అన్నారు. అందుకోసం నవంబర్ నెలలో అన్ని జిల్లాల్లో సదస్సులు, డిసెంబర్ లో హైదరాబాద్ లో భారీ ర్యాలీలు నిర్వహిస్తాం అన్నారు. జనవరిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సహా అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి కేంద్రంపై ఒత్తిడి తీసుకొస్తామని అన్నారు.



## 85 శాతం మెడికల్ పీజీ సీట్లు తెలంగాణవాళ్లకే

మొదటి పేజీ తరువాయి

నిర్ణయించింది. ఈ క్రమంలో.. ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ గారి విజ్ఞప్తితో మేనేజ్‌మెంట్ కోటాలో 85 శాతం సీట్లు లోకల్ విద్యార్థులకు కేటాయించేందుకు సీఎం రేవంత్ రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దీనిపై వెంటనే ఉత్తర్వులు జారీ చేయాలని హెల్త్ సెక్రటరీని సైతం సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఈ లెక్కన రాష్ట్ర విద్యార్థులకు అదనంగా 318 మెడికల్ పీజీ, 70 డెంటల్ పీజీ సీట్లు దక్కనున్నాయి. కాగా, తమ దశాబ్దకాల ఆకాంక్షను నెరవేర్చిన సీఎం రేవంత్ రెడ్డి, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహకు తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్‌కృతజ్ఞతలు తెలిపింది.

## ఇంకెప్పుడు బీసీ రిజర్వేషన్!

**ఇప్పుడు సాధ్యం కాకపోతే ఎన్నడూ కాదు**

**ఢిల్లీకి వెళ్లి అందరం న్యాయం చేయాలని కోరుదాం: వీహెచ్**

ఇప్పుడు కాకపోతే ఇంకా ఎప్పటికీ బీసీ రిజర్వేషన్ సాధ్యం కాదు.. ఢిల్లీ వెళ్లి అందరినీ కలిసి మనకి న్యాయం చేయాలని కోరదాం.. రాష్ట్రంలో ఎన్ని ఉద్యమాలు చేసిన కేంద్రంలో ఎలాంటి మార్పు రావటం లేదని మాజీ ఎంపీ వీ.హన్మంత రావు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం గాంధీ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నిజంగా బీసీలకు న్యాయం జరగాలంటే దేశ వ్యాప్తంగా ఉన్న సీఎంలు, ఎంపీలని కలవాలని, జూబ్లీ ఎన్నిక అనంతరం అన్ని రాష్ట్రాలు తిరిగి మన కులగణన గురించి చెప్పుతామన్నారు. 9 షెడ్యూల్‌లో బిల్ పాస్ అయితేనే బీసీలకు న్యాయం జరిగినట్లు అని, మోడీకి సపోర్ట్ చేసే రాష్ట్రాల నాయకులను కలిసి వారి మద్దతును కోరాలని వీహెచ్‌సూచించారు. ఇక్కడ ఎన్ని రోజులు కష్టపడ్డ పేపర్ లకి మాత్రమే పరిమితం అవుతుందన్నారు.

## రాత్రి 11 వరకే మెట్రో


మొదటి పేజీ తరువాయి

ట్రైన్స్ నడుస్తాయి. అన్ని టెర్మినల్ స్టేషన్ల నుండి ఈ వేళల్లో ప్రయాణ సదుపాయం అందుబాటులో ఉంటుంది. ప్రస్తుతం సోమవారం నుంచి శుక్రవారం వరకు ఉదయం 6 గంటల నుంచి రాత్రి 11:45 గంటల వరకు మెట్రో సేవలు అందుబాటులో ఉన్నాయి. శనివారం రోజున ఉదయం 6 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు.. ఆదివారం రోజున ఉదయం 7 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు రైళ్లు నడుస్తాయి.

# రేవంత్ తోక కట్ చేస్తరు

మొదటి పేజీ తరువాయి

తెలిపారు. రేవంత్‌రెడ్డి లాంటి వాళ్లను గతంలో చాలామందిని చూశామని చెప్పారు. జూబ్లీహిల్స్ రహమత్‌నగర్‌లో కేటీఆర్ రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జూబ్లీహిల్స్ ప్రజలంటే మాగంటి గోపీనాథ్‌కు ఎంతో అభిమానం ఉండేదన్నారు. జూబ్లీహిల్స్ ప్రజలకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని తెలిపారు. గోపన్నపై అభిమానాన్ని మరోసారి జూబ్లీహిల్స్ ప్రజలు చాటిచెప్పాలని కోరారు. ప్రతిభానగర్ నుంచి రెహమత్‌నగర్ వరకు ప్రజలు బ్రహ్మరథం పట్టారని తెలిపారు. 2023లో అత్యధిక మెజార్టీ ఇచ్చింది రెహమత్ నగర్ అని గుర్తుచేశారు. ఈసారి 12వేల మెజార్టీ రెహమత్‌నగర్ నుంచి వస్తుందని అనిపిస్తోందని పేర్కొన్నారు. గోపన్న నిరుపేదల కోసం ఎంతో కృషి చేశారన్నారు. కోట్ల రూపాయలతో వాటర్ ట్యాంకులు కట్టి నీటి సమస్యను తరిమికొట్టామని తెలిపారు. అభివృద్ధి సంక్షేమాన్ని అన్నివర్గాలకు అందించిన నేత గోపీనాథ్ అన్నారు. గోపీనాథ్ అకాల మరణం తీరని లోటు అన్నారు. భర్త చనిపోయిన మాగంటి సునీతమ్మ ఏడిస్తే ఆరోపణలు చేస్తారా అని మండిపడ్డారు. ఒక్క ఆడబిడ్డను ఓడించేందుకు రేవంత్ కాలికి బలపం కట్టుకుని తిరుగుతున్నాడన్నారు. రెండేండ్ల రేవంత్ ఒక్క మంచి పని చేశాడా అని ప్రశ్నించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఎంత అభివృద్ధి జరిగిందో గుర్తుకు తెచ్చుకోవాలన్నారు. జూబ్లీహిల్స్ ప్రజలు పెట్టే వాతలకు రేవంత్‌కి బుద్ధి రావాలన్నారు. మహామహులకు బుద్ధి చెప్పిన ఘనత తెలంగాణ గడ్డదని వ్యాఖ్యానించారు. అడ్డగోలు హామీలు ఇచ్చి ప్రజలను పచ్చి మోసం చేశారని రేవంత్‌పై కేటీఆర్ మండిపడ్డారు. పథకాలను రద్దు చేస్తానని సీఎం బెదిరిస్తున్నాడని విమర్శించారు. అసలేం పథకం ప్రారంభించావని నిలదీశారు. కేసీఆర్ అమలు చేసిన పథకాలను రేవంత్ రద్దు చేసిందని విమర్శించారు. రేవంత్ అమలు చేసిన ఏ పథకం చూసి కాంగ్రెస్‌కు ఓటు వేయాలని ప్రశ్నించారు. రెండు




లక్షల ఉద్యోగాలు ఇస్తామన్నారు.. ఇచ్చారా అని అడిగారు. స్పెషల్ ఉర్దూ డీఎస్సీ నిర్వహిస్తామన్నాడు ఏమైందన్నారు. కేవలం ఐదేళ్ల కోసమే రేవంత్‌ని గెలిపించారని చెప్పారు. సరిగ్గా పాలించకపోతే బుద్ధి చెప్పి ఇంటికి పంపిస్తారన్నారు. కేవలం 500 రోజుల సమయమే ఉందని తెలిపారు. 500 రోజుల తర్వాత బీఆర్ఎస్ అధికారంలోకి రాబోతుందని, కేసీఆర్ తిరిగి సీఎం కాబోతున్నారని ధీమా వ్యక్తం చేశారు. ఎన్టీఆర్ హిల్స్‌లో బ్రహ్మాండమైన స్టేడియం కట్టి గోపీనాథ్ పేరు పెడతామని తెలిపారు.

## విద్య, ఉద్యోగవాణి

### ఎన్ఎఫ్‌సీలో 405 అప్రెంటిస్ ఖాళీల భర్తీ

న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్ - హైదరాబాద్‌లో 405 అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. పదో తరగతి, ఐటిఐ పూర్తి చేసిన అభ్యర్థులు అప్లై చేసుకునేందుకు అర్హులుగా పేర్కొంది. ఈ నెల 15 వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉంది. మెరిట్ ద్వారా ఎంపిక ఉంటుంది. నెలకు రూ.9,600-10,560 వరకు స్టైఫండ్ చెల్లిస్తారు.



# ఒక్క ఏడాదే 17 లక్షల మంది బలి!

## భారత్‌లో దారుణంగా వాయు కాలుష్యం .. లాన్సెట్ జర్నల్ నివేదికలో కీలక విషయాలు

**2010తో పోలిస్తే 38 శాతం**

**పెరిగిన కాలుష్య మరణాలు**



న్యూఢిల్లీ: భారత్‌లో వాయు కాలుష్యం పెను భూతంలా మారుతూ లక్షలాది మంది ప్రాణాలను బలిగొంటోంది. ప్రభుత్వం ఎంతగా కాదన్నా దేశంలో ఇది అత్యంత తీవ్రమైన ప్రజారోగ్య సమస్యగా కొనసాగుతోందని మరోసారి రుజువైంది. 2022లో ఒక్క ఏడాదిలోనే విషపూరిత గాలి కారణంగా 17 లక్షల మందికి పైగా భారతీయులు మరణించారని తాజా అధ్యయనం తేల్చింది. 2010తో పోలిస్తే ఈ మరణాల సంఖ్య ఏకంగా 38 శాతం అధికం కావడం ఆందోళన కలిగిస్తోంది. ప్రఖ్యాత "లాన్సెట్ కౌంట్‌డౌన్ ఆన్ హెల్త్ అండ్ క్లైమేట్ చేంజ్" నివేదిక ఈ చేదు నిజాలను వెలుగులోకి తెచ్చింది. 71 విద్యాసంస్థలు, ఐక్యరాజ్యసమితి ఏజెన్సీలకు చెందిన 128 మంది నిపుణులు ఈ నివేదికను రూపొందించారు. శిలాజ ఇంధనాలపై మితిమీరి ఆధారపడటం, వాతావరణ మార్పులను ఎదుర్కోవడంలో విఫలమవడం ప్రజల ఆరోగ్యంపై ఎలాంటి తీవ్ర ప్రభావం చూపుతోందో ఇది స్పష్టం చేసింది. ఈ నివేదికపై ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ జెరెమీ ఫర్రార్ మాట్లాడుతూ, "వాతావరణ సంక్షోభం అంటే ఆరోగ్య సంక్షోభమే. పెరుగుతున్న ప్రతి డిగ్రీ ఉష్ణోగ్రత ప్రజల ప్రాణాలను, జీవనోపాధిని బలిగొంటోంది. ప్రభుత్వాల నిర్లక్ష్యం ప్రజలను చంపుతోంది. అయితే, వాతావరణ మార్పులపై సరైన చర్యలు తీసుకుంటే అదే మనకు గొప్ప ఆరోగ్య అవకాశం. స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన ఆహారం, పటిష్టమైన ఆరోగ్య వ్యవస్థలు లక్షలాది మంది ప్రాణాలను కాపాడగలవు" అని వివరించారు. నివేదిక ప్రకారం, 2001-2023 మధ్య కాలంలో భారత్ సుమారు 23.3 లక్షల హెక్టార్ల అటవీ భూమిని కోల్పోయింది. కేవలం 2023లోనే 1.43 లక్షల హెక్టార్ల అడవులు కనుమరుగయ్యాయి. గడిచిన పదేళ్లలో పట్టణ ప్రాంతాల్లో పచ్చదనం 3.6 శాతం మేర తగ్గింది. ఈ నివేదిక వెలువడిన సమయానికే దేశ రాజధాని ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో వాయు కాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరింది. దీని కారణంగా శ్వాసకోశ సంబంధిత వ్యాధులతో ఆసుపత్రులకు వచ్చేవారి సంఖ్య 15 శాతం పెరిగినట్లు నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గొంతులో మంట, అలసట, తలనొప్పి వంటి లక్షణాలు వారిని వేధిస్తున్నాయి. అపోలో ఆసుపత్రికి చెందిన పల్మనాలజీ నిపుణుడు డాక్టర్ రాజేశ్ చావ్లా మాట్లాడుతూ "గాలిలోని ప్రమాదకర కాలుష్య కారకాలు క్యాన్సర్, గుండె పనితీరు మందగించడం వంటి దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలకు దారితీస్తాయి. ఈ నెలల్లో రోగుల సంఖ్య 15 శాతం పెరిగింది. వారు కోలుకోవడానికి కూడా ఎక్కువ సమయం పడుతోంది" అని తెలిపారు. సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ డేటా ప్రకారం గత వారంలో ఢిల్లీలో పీఎం 2.5 కణాల సాంద్రత క్యూబిక్ మీటర్‌కు 488 మైక్రోగ్రాములకు చేరింది. ఇది గత ఐదేళ్లలో అత్యధికం కావడం గమనార్హం.

## దేశ కీర్తిని ప్రపంచానికి చాటా

**అలాంటిది నేను దేశద్రోహినా?**

**కిషన్ రెడ్డిపై అజారుద్దీన్ ఫైర్**

హైదరాబాద్, నవంబర్ 1 (ఈవార్తలు): కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తనను "దేశద్రోహి" అనడంపై తెలంగాణ మంత్రి, మాజీ క్రికెటర్ అజారుద్దీన్ తీవ్రంగా స్పందించారు. ఈ వ్యాఖ్యలపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్టు ఆయన హెచ్చరించారు. ఈరోజు ఓ న్యూస్ ఛానల్‌తో మాట్లాడిన అజారుద్దీన్, కిషన్ రెడ్డిపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. "దేశ కీర్తిని ప్రపంచానికి చాటిన నేను దేశద్రోహినా?" అని అజారుద్దీన్ ఆవేదన వ్యక్తం చేశారు. మ్యాచ్ ఫిక్సింగ్ ఆరోపణల నుంచి న్యాయస్థానం తనకు క్లీన్ చిట్ ఇచ్చిందని గుర్తుచేశారు. అయినప్పటికీ, మాట్లాడటానికి మరే అంశం లేక బీజేపీ నేతలు పదేపదే పాత ఆరోపణలనే తిరగదోడుతున్నారని మండిపడ్డారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను దృష్టిలో ఉంచుకునే బీజేపీ తనను లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేస్తోందని ఆరోపించారు. కిషన్ రెడ్డికి క్రికెట్ గురించి ఏం తెలుసని అజారుద్దీన్ ప్రశ్నించారు. "ఆయనకు కనీసం క్రికెట్ బ్యాట్ అయినా సరిగ్గా పట్టుకోవడం వచ్చా?" అంటూ ఘాటుగా విమర్శించారు.

# ప్రభుత్వం బెదిరిస్తోంది

## బంద్‌కు పిలుపునిస్తున్నాం.. తెలంగాణ ఉన్నత విద్యాసంస్థల సమాఖ్య




హైదరాబాద్, నవంబర్ 1 (ఈవార్తలు): ప్రభుత్వం తమను బెదిరింపులకు గురి చేస్తోందని ఉన్నత విద్యాసంస్థల సమాఖ్య ఛైర్మన్ రమేశ్ బాబు ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని ఫతేమైదాన్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఫీజు రీయింబర్సుమెంట్ బకాయిలపై గత 6 నెలలుగా ప్రభుత్వంతో చర్చలు జరిపామని, ప్రస్తుతం రూ. 1,200 కోట్లు ఇవ్వాలని కోరామని తెలిపారు. మిగిలిన బకాయిల చెల్లింపులపై ఒక స్పష్టమైన ప్రణాళికను రూపొందించాలని ప్రభుత్వాన్ని కోరినట్లు చెప్పారు. అయితే, ప్రభుత్వం రూ. 300 కోట్లు మాత్రమే ఇచ్చిందని, మిగిలిన రూ. 900 కోట్లు దీపావళికి విడుదల చేయాలని, అలాగే నవంబర్ 1 నాటికి పెండింగ్ బకాయిలన్నీ చెల్లించాలని కోరినట్లు ఆయన తెలిపారు. ఈ బకాయిల గురించి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కతో సహా అందరినీ కలిశామని, కానీ అధికారులు తమ విజ్ఞప్తిని పెడచెవిన పెట్టారని ఆయన అన్నారు. ప్రభుత్వం తమను బెదిరింపులకు గురి చేస్తోందని, తమ మీద విజిలెన్స్ విచారణకు ఆదేశించారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలోని అన్ని వృత్తి విద్యా కళాశాలలు నవంబర్ 3 నుంచి నిరవధికగా మూసివేయబడతాయని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి రేపటిలోగా సానుకూల నిర్ణయం తీసుకోవాలని ఆయన కోరారు. ఈ బంద్ సమయంలో పరీక్షలను వాయిదా వేయాలని విజ్ఞప్తి చేశారు. నవంబర్ 6న అన్ని కళాశాలల సిబ్బందితో కలిసి దాదాపు లక్ష మందితో సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని ఆయన అన్నారు. నవంబర్ 10 లేదా 11న 10 లక్షల మంది విద్యార్థులతో భారీ బహిరంగ సభను ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. ఒకటి రెండు కళాశాలలకు మాత్రమే బకాయిలు ఎందుకు చెల్లించారో చెప్పాలని ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు. 10 శాతం లంచం తీసుకుని నిధులు విడుదల చేశారా అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అవసరమైతే ఎమ్మెల్యేలు, అధికారుల ఇళ్లను ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. బంద్ కారణంగా విద్యార్థులు, తల్లిదండ్రులకు కలిగే అసౌకర్యానికి ఆయన క్షమాపణలు తెలిపారు.

# వాళ్లు నాశనమైపోతారు

**మంచు కుటుంబ గొడవలపై మంచు లక్ష్మి**

**విష్ణు, మనోజ్‌ను విడదీయాలని**

**చూస్తున్నారంటూ ఆగ్రహం**



హైదరాబాద్, నవంబర్ 1 (ఈవార్తలు): మంచు కుటుంబంలో గత కొంతకాలంగా జరుగుతున్న విభేదాల ప్రచారంపై నటి, నిర్మాత మంచు లక్ష్మి తీవ్రంగా స్పందించారు. తన సోదరులు విష్ణు, మనోజ్‌ల మధ్య చిచ్చుపెట్టి విడదీయాలని చూస్తున్న వారు నాశనమైపోతారంటూ ఆమె సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆమె, కొన్ని మీడియా సంస్థలు, యూట్యూబ్ ఛానెళ్లు తమ కుటుంబం గురించి తప్పుడు ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. మనోజ్ నటించిన 'మిరాయ్' సినిమా ఈవెంట్‌లో తాను మాట్లాడిన మాటలను కత్తిరించి, వక్రీకరించి ప్రచారం చేశారని లక్ష్మి ఆరోపించారు. "ఆ ఈవెంట్‌లో నేను విష్ణు గురించి మాట్లాడకపోయినా, అతడిని తిట్టినట్లుగా థంబ్‌నైల్స్ పెట్టి తప్పుగా చూపించారు. ఒక కుటుంబాన్ని కలపాలనుకుంటున్నారా? లేక విడదీయాలనుకుంటున్నారా? తమ్ముళ్ల మధ్య అగ్గిరాజేసి విడదీయాలని చూసిన వారందరూ నాశనం అవుతారు. మీ కర్మ మీరే అనుభవిస్తారు" అంటూ ఆమె శాపనార్థాలు పెట్టారు. ఇదే సమయంలో తన కుమార్తె విద్యా నిర్వాణను విష్ణుకు చెందిన స్కూల్ నుంచి ఎందుకు మాన్పించాల్సి వచ్చిందో కూడా లక్ష్మి వివరించారు. "నా కూతురు విష్ణు వాళ్ల స్కూల్‌లోనే చదివేది. కానీ అక్కడ అందరూ తనపై ఎక్కువ శ్రద్ధ చూపించడం, సేవలు చేయడంతో విలాసవంతమైన జీవితానికి అలవాటవుతోందని గమనించాను. అది తన భవిష్యత్తుకు మంచిది కాదనే ఉద్దేశంతోనే ఆ స్కూల్ మాన్పించి మరో చిన్న పాఠశాలలో చేర్పించాను. ఈ నిర్ణయం వల్ల ఇంట్లో వాళ్లు బాధపడినప్పటికీ, నా కూతురి భవిష్యత్తు కోసం తప్పలేదు" అని ఆమె స్పష్టం చేశారు. గత కొంతకాలంగా మంచు విష్ణు, మనోజ్‌ల మధ్య విభేదాలు తలెత్తినట్లు, మనోజ్ ఇంటి నుంచి బయటకు వచ్చినట్లు వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కుటుంబ వ్యవహారాలపై మంచు లక్ష్మి చేసిన తాజా వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.



# విదేశీ ప్రముఖులతో రేవంత్ భేటీ

**కెనడా హైకమిషనర్, ఫ్రాన్స్ కాన్సుల్ జనరల్ బృందాలు సమావేశం**

**ఐటీ, ఫార్మా, ఏరోస్పేస్, డిఫెన్స్ అంశాలపై క్రిస్టోఫర్ కూటర్ బృందంతో చర్చ**

**తెలంగాణలో మరిన్ని పెట్టుబడులు పెట్టాలని కెనడా హైకమిషనర్‌ను కోరిన సీఎం**

**హైదరాబాద్‌లోని ఫ్రాన్స్ ప్రాజెక్టులను ఫ్రాన్స్ కాన్సుల్ జనరల్‌కు వివరించిన సీఎం**

హైదరాబాద్, నవంబర్ 1 (ఈవార్తలు): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కెనడా హైకమిషనర్ క్రిస్టోఫర్ కూటర్, ఫ్రాన్స్ కాన్సుల్ జనరల్ మార్క్ లామీ బృందాలు వేర్వేరుగా సమావేశమయ్యాయి. ఈ సందర్భంగా రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని ముఖ్యమంత్రి వారిని ఆహ్వానించారు. కెనడా హైకమిషనర్ క్రిస్టోఫర్ కూటర్ బృందంతో జరిగిన సమావేశంలో ఐటీ, ఫార్మా, ఏరో స్పేస్, డిఫెన్స్, అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రంగాల్లో కెనడాతో భాగస్వామ్యంపై చర్చించారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కెనడా హైకమిషనర్‌కు వివరించారు. తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని ఆయన కోరారు. స్టార్టప్స్, ఎడ్యుకేషన్, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్స్‌లో పెట్టుబడులకు అవకాశాలను పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఫ్రాన్స్ కాన్సుల్ జనరల్ మార్క్ లామీ బృందంతో జరిగిన సమావేశంలో, భాగ్యనగరంలో అమలవుతున్న ఫ్రాన్స్ ప్రాజెక్టులపై చర్చించారు. నగరంలో మరిన్ని పెట్టుబడులు పెట్టాలని ముఖ్యమంత్రి వారిని కోరారు. హైదరాబాద్‌లో ఫ్రెంచ్ బ్యూరో కార్యాలయాన్ని మరింత బలోపేతం చేయాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు.

## ఓటర్లను రేవంత్ రెడ్డి బెదిరిస్తున్నారు

**ఈసీకి బీజేపీ నేతల ఫిర్యాదు**

**ఈసీని కలిసిన ఏలేటి మహేశ్వర్ రెడ్డి, పాయల్ శంకర్**

**రేవంత్ రెడ్డిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్**

హైదరాబాద్, నవంబర్ 1 (ఈవార్తలు): కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయకుంటే పథకాలు రద్దవుతాయని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఓటర్లను బెదిరిస్తున్నారని బీజేపీ నేతలు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారం సందర్భంగా ఆయన చేసిన వ్యాఖ్యలపై ఏలేటి మహేశ్వర్ రెడ్డి, పాయల్ శంకర్ పలువురు పార్టీ నాయకులతో కలిసి ఈసీకి ఫిర్యాదు చేశారు. పథకాలు రద్దవుతాయని బెదిరించిన ముఖ్యమంత్రిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. రెండు రోజుల ముందు, అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇవ్వడంపై కూడా బీజేపీ నేతలు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఉప ఎన్నికల సమయంలో ఓ వర్గం ఓట్ల కోసం ఆయనకు మంత్రి పదవి ఇస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

**బ్లాక్ మెయిల్ రాజకీయాలు: ఏలేటి మహేశ్వర్ రెడ్డి**

జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో, కాంగ్రెస్‌కు ఓటు వేయని వారికి ప్రభుత్వం నుంచి లభించే ప్రయోజనాలను ఆపేస్తామని ప్రజలను బెదిరించడాన్ని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి తప్పుబట్టారు. ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ, రేవంత్ రెడ్డిపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశామని తెలియజేశారు. 23 నెలల కాంగ్రెస్ పాలనలో ఇచ్చిన 420 హామీలలో దేనిని కూడా అమలు చేయలేదని విమర్శించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయకుంటే రేషన్ కట్ అవుతుందని, పెన్షన్ రాదని చెప్పడం బ్లాక్‌మెయిల్ కిందకు వస్తుందని అన్నారు.

## పదవి రాజీనామాకూ రెడీ

**తలసాని శ్రీనివాస్ యాదవ్**

హైదరాబాద్, నవంబర్ 1 (ఈవార్తలు): మాజీ మంత్రి, సనత్ నగర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యంగా సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. కంటోన్మెంట్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూపిస్తే తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని సంచలన సవాల్ విసిరారు. శనివారం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఆయన, బీఆర్ఎస్ పదేళ్ల పాలనలోనే హైదరాబాద్ అద్భుతంగా అభివృద్ధి చెందిందని అన్నారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి రెండేళ్లు గడుస్తున్నా, హైదరాబాద్‌కు రేవంత్ రెడ్డి చేసిందేమీ లేదని ఆయన విమర్శించారు. "జూబ్లీహిల్స్‌లో ఓటమి భయం పట్టుకోవడం వల్లే అజారుద్దీన్‌కు మంత్రి పదవి కట్టబెట్టారు" అని తలసాని ఆరోపించారు. కాంగ్రెస్‌కు ఓటు వేయకపోతే రేషన్ కార్డులు, బియ్యం ఆగిపోతాయంటూ ఆ పార్టీ నేతలు ప్రజలను బెదిరిస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ నేతలతో సంక్షేమ పథకాలు ఎలా అమలు చేయించాలో బీఆర్ఎస్‌కు బాగా తెలుసని ఆయన వ్యాఖ్యానించారు. ఈ ఎన్నికల్లో జూబ్లీహిల్స్‌లో గెలిచేది బీఆర్ఎస్ పార్టీయే అని తలసాని ధీమా వ్యక్తం చేశారు. అత్యంత భారీ మెజార్టీతో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత అసెంబ్లీలో అడుగుపెడతారని ఆయన జోస్యం చెప్పారు.

## బీఆర్ఎస్‌లో చేరిన టీడీపీ నేత

**కండువా కప్పి ఆహ్వానించిన కేటీఆర్**



హైదరాబాద్, నవంబర్ 1 (ఈవార్తలు): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల సమయంలో తెలంగాణ తెలుగుదేశం పార్టీ నుంచి బీఆర్ఎస్‌లోకి చేరికలు జరిగాయి. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో రాష్ట్ర టీడీపీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ నాయుడు, పలువురు పార్టీ నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. కేటీఆర్ వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీలో సుదీర్ఘకాలం పనిచేసిన శ్రీనివాస్ నాయుడును పార్టీలోకి సాదరంగా ఆహ్వానిస్తున్నామని అన్నారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపించిందని, ఎన్నో హామీలు ఇచ్చిందని, కానీ ఒక్కటీ నెరవేర్చలేదని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశామని అన్నారు. ఎమ్మెల్యే, మంత్రి లేదా ముఖ్యమంత్రి పదవి ఏదైనా ప్రజలు పెట్టిన భిక్ష అని ఆయన అన్నారు. అలాంటి ప్రజలను 'మీరు ఓటు వేయకుంటే ఏమీ ఇవ్వం' అని బెదిరించడమేమిటని ప్రశ్నించారు. ఈ దేశంలో ఎన్టీఆర్, ఇందిరా గాంధీలను కూడా ప్రజలు ఓడించారని గుర్తు చేశారు. అలాంటిది ప్రజలకు మూడడుగుల రేవంత్ రెడ్డి ఎంత అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి తనకు తాను చక్రవర్తిగా భావిస్తున్నారని మండిపడ్డారు. సంక్షేమ పథకాలు ఆపేస్తామని బెదిరిస్తే, అదే ప్రజలు జూబ్లీహిల్స్‌లో ఆయన తోక కట్ చేసే ఆలోచనలో ఉన్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఈ ఉప ఎన్నికల్లో బుద్ధి చెబుతారని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక చేసిన ఒక్క మంచి పని చెప్పాలని నిలదీశారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ 420 హామీలు ఇచ్చిందని కానీ ఒక్క పని కూడా చేయలేదని విమర్శించారు. ముఖ్యమంత్రి అంటే ప్రజల సొమ్ముకు ధర్మకర్త అని గుర్తించాలని అన్నారు. ముఖ్యమంత్రి గారూ, మనది ఐదేళ్ల తాత్కాలిక ఉద్యోగం మాత్రమే, ఆ తర్వాత ప్రజలకు ఇష్టం లేకుంటే మనల్ని చెత్తబుట్టలో పడేస్తారని హెచ్చరించారు. ఇటీవల జూబ్లీహిల్స్‌లో జరిగిన కార్యకర్తల సమావేశంలో పార్టీ అభ్యర్థి మాగంటి సునీత తన భర్త గుర్తుకు వచ్చి ఏడిస్తే, దానిని కూడా కాంగ్రెస్ రాజకీయం చేసిందని మండిపడ్డారు.

## రేవంత్ దేశ గౌరవాన్ని దెబ్బతీశారు

**సైనికుల ధైర్యసాహసాలను అవమానించారు**

**కేంద్ర మంత్రి బండి సంజయ్ మండిపాటు**

**ఉగ్రవాదంపై మోదీ చర్యలపై ప్రస్తావన**

**రేవంత్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్**



కరీంనగర్, నవంబర్ 1 (ఈవార్తలు): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీజేపీ ఎంపీ బండి సంజయ్ తీవ్రంగా స్పందించారు. జూబ్లీహిల్స్‌లో ఎన్నికల ప్రచారం సందర్భంగా పాకిస్థాన్ గురించి సీఎం చేసిన వ్యాఖ్యలు దేశ గౌరవాన్ని, సైనికుల ధైర్యసాహసాలను అవమానించేలా ఉన్నాయని ఆయన ఆరోపించారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా రేవంత్ రెడ్డిపై విమర్శలు గుప్పిస్తూ, బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లను ఉద్దేశించి రేవంత్ రెడ్డి కొన్ని వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలో పాకిస్థాన్ మనపై దాడి చేసినా భారత్ స్పందించలేదన్న అర్థం వచ్చేలా సీఎం మాట్లాడారని బండి సంజయ్ ఆరోపించారు. "జూబ్లీహిల్స్‌లో భారత్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన అవమానకర వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాను. ఆయన వ్యాఖ్యలు పాకిస్థాన్‌లోని ఉగ్రశిబిరాలను ధ్వంసం చేసిన మన సైనికుల ధైర్యసాహసాలకు అవమానం" అని బండి సంజయ్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు. ప్రతి భారతీయుడు మన జవాన్ల సాహసం పట్ల గర్వపడుతున్నాడని ఆయన తెలిపారు. "ఆపరేషన్ సింధూర్ ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు పొందింది. ఇది ఉగ్రవాదంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీసుకున్న కఠిన చర్యలకు ప్రతీక. దేశ రక్షణ కోసం ప్రాణాలను పణంగా పెట్టిన సైనికులకు, భారత ప్రజలకు సీఎం రేవంత్ బేషరతుగా క్షమాపణ చెప్పాలి," అని బండి సంజయ్ డిమాండ్ చేశారు.



జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో ఆపరేషన్ సిందూర్‌పై సీఎం రేవంత్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ శనివారం సాయంత్రం స్థానిక అంగడి బజార్లో సీఎం దిష్టిబొమ్మ దగ్ధం చేసిన బీజేపీ నేతలు బొబ్బిలి వెంకటస్వామి యాదవ్, గుండేటి గంగారాం, బొమ్మన పరమేష్, పొనుగంటి గౌతం, నక్కా ఆనందం తదితరులు

## జగిత్యాల జిల్లా పరిధిలో సిటీ పోలీస్ యాక్ట్

**ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాలు జారీ**



జగిత్యాల టౌన్, నవంబర్ 1 (ఈవార్తలు): జగిత్యాల జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకొని నెల రోజుల (నవంబర్ 1వ తేది నుంచి 30 వరకు) పాటు జిల్లా వ్యాప్తంగా పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. దీని ప్రకారం పోలీసు అధికారుల అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు, రాస్తా రోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్స్, సభలు, సమావేశాలు నిర్వహించరాదని అన్నారు. శాంతిభద్రతలకు భంగం కలిగించేలా, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కల్గించే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని హెచ్చరించారు. ప్రజలు పోలీసులకు సహకరించి శాంతిభద్రతల పరిరక్షణకు కృషిచేయాలని కోరారు.





# కాశీబుగ్గ తొక్కిసలాటపై ప్రధాని దిగ్భ్రాంతి



## మృతుల కుటుంబాలకు 15 లక్షలు

**ఏపీ మంత్రి లోకేశ్ వెల్లడి**

శ్రీకాకుళం, నవంబర్ 1 (ఈవార్తలు): శ్రీకాకుళం జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. కాశీబుగ్గలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఏకాదశి పర్వదినం సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో 9 మంది భక్తులు దుర్మరణం చెందారు. ఈ దుర్ఘటనలో మరో 16 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ఏకాదశి కావడంతో ఆలయానికి ఊహించని రీతిలో భక్తులు పోటెత్తడమే ఈ ప్రమాదానికి కారణంగా తెలుస్తోంది. విషాద వార్త తెలిసిన వెంటనే రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్, ఇతర మంత్రులతో కలిసి హుటాహుటిన కాశీబుగ్గకు చేరుకున్నారు. ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలించి, అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం పలాసలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు వెళ్లి చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. వారికి అందుతున్న వైద్యం గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు మెరుగైన చికిత్స అందించాలని, అవసరమైతే మెరుగైన ఆసుపత్రికి తరలించాలని ఆదేశించారు. ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని బాధితులకు, వారి కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.15 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నట్లు ప్రకటించారు. తీవ్రంగా గాయపడిన వారికి రూ.3 లక్షలు అందజేస్తామన్నారు. తక్షణ ఖర్చుల కోసం మృతుల కుటుంబాలకు రూ.10 వేల చొప్పున అందజేశామని వివరించారు. ఈ ఘటనపై ప్రధాని కార్యాలయానికి కూడా సమాచారం అందించామని, వారు కూడా స్పందించి మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, క్షతగాత్రులకు రూ.50 వేల చొప్పున సాయం ప్రకటించారని లోకేశ్ తెలిపారు. మృతుల్లో ముగ్గురు తెలుగుదేశం పార్టీ సభ్యులు ఉన్నారని, పార్టీ ప్రమాద బీమా పథకం ద్వారా వారి కుటుంబాలకు అదనంగా రూ.5 లక్షల చొప్పున సాయం అందిస్తామని వెల్లడించారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.

### రాహుల్, ఖర్గే దిగ్భ్రాంతి

ఘోర విషాదంపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధితులకు తక్షణ సాయం అందించాలని డిమాండ్ చేశారు. ఈ దుర్ఘటనపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పందిస్తూ, "ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం కాశీబుగ్గ వెంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగిన తొక్కిసలాటలో ప్రాణనష్టం జరగడం నన్ను తీవ్రంగా కలచివేసింది. మృతుల కుటుంబాలకు, గాయపడిన వారికి నా ప్రగాఢ సానుభూతి. వారు త్వరగా కోలుకోవాలని ఆశిస్తున్నాను," అని 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. బాధితుల కుటుంబాలకు వేగంగా, గౌరవప్రదంగా సహాయం అందించేందుకు అందుబాటులో ఉన్న అన్ని వనరులను వినియోగించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సహాయక చర్యల్లో పాలుపంచుకుని, బాధిత కుటుంబాలకు అండగా నిలవాలని స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా ఈ ఘటనపై సంతాపం తెలిపారు. '

### మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల పరిహారం

న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో తొక్కిసలాట జరిగి 9 మంది మరణించిన ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దురదృష్టకర సంఘటన అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలిపిన ప్రధాని, బాధితులకు ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. ఈ ఘటనపై స్పందించిన ప్రధాని మోదీ, "ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగిన తొక్కిసలాట అత్యంత బాధాకరం. తమ సన్నిహితులను, కుటుంబసభ్యులను కోల్పోయిన వారికి ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నాను. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను" అని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అదేవిధంగా, ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి నుంచి రూ. 2 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. గాయపడిన వారికి రూ. 50,000 ఆర్థిక సహాయం అందిస్తామని ప్రధాని కార్యాలయం వెల్లడించింది. ఆలయంలో జరిగిన ఈ విషాద ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

## ఘటనపై ఏపీ సర్కారు విచారణ



అమరావతి, నవంబర్ 1 (ఈవార్తలు): శ్రీకాకుళం జిల్లాలోని కాశీబుగ్గలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. స్థానిక శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగిన తొక్కిసలాటలో 9 మంది భక్తులు ప్రాణాలు కోల్పోయారు. ఈ దుర్ఘటనపై రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాద సమాచారం అందిన వెంటనే జిల్లా ఎస్పీ, ఇతర ఉన్నతాధికారులతో మాట్లాడి సహాయక చర్యలను ముమ్మరం చేయాలని ఆదేశించారు. ఈ ఘటనపై హోంమంత్రి అనిత స్పందిస్తూ, "కాశీబుగ్గ ఆలయంలో తొక్కిసలాట జరిగి పలువురు భక్తులు మరణించారన్న వార్త నన్ను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ప్రమాదం గురించి తెలియగానే అధికారులను అప్రమత్తం చేసి సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించాం. గాయపడిన వారిని వెంటనే ఆసుపత్రులకు తరలించి మెరుగైన చికిత్స అందించాలని సూచించాం. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి. కూటమి ప్రభుత్వం వారి కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటుంది" అని భరోసా ఇచ్చారు.

### ప్రమాదం ఎలా జరిగింది?

ప్రమాదం జరిగిన తీరును హోంమంత్రి అనిత విలేకరులకు వివరించారు. ఈ ఆలయం మొదటి అంతస్తులో ఉందని, భక్తులు సుమారు 20 మెట్లు ఎక్కి పైకి వెళ్లాల్సి ఉంటుందని తెలిపారు. ఈ క్రమంలో మెట్ల మార్గంలోని రెయిలింగ్ ఒక్కసారిగా విరిగిపడిందని, దీంతో భక్తులు ఒకరిపై ఒకరు పడిపోయి తొక్కిసలాట జరిగిందని పేర్కొన్నారు. సాధారణంగా ప్రతి వారం ఈ ఆలయానికి 1,500 నుంచి 2,000 మంది భక్తులు వస్తుంటారని ఆమె చెప్పారు. మృతుల్లో ఎక్కువ మంది మహిళా భక్తులు ఉండటం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనపై సమగ్ర విచారణకు ఆదేశించినట్లు హోంమంత్రి తెలిపారు. గాయపడిన వారికి ప్రస్తుతం ప్రాణాపాయం లేదని తెలిసిందని, వారికి మెరుగైన వైద్యం అందుతోందని స్పష్టం చేశారు. ఈ ఘటనతో కాశీబుగ్గలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## భక్తులు మృతి దురదృష్టకరం



అమరావతి, నవంబర్ 1 (ఈవార్తలు): శ్రీకాకుళం జిల్లా పలాస-కాశీబుగ్గలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగిన తొక్కిసలాట ఘటనపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతి, విచారం వ్యక్తం చేశారు. ఏకాదశి పర్వదినం సందర్భంగా చోటుచేసుకున్న ఈ దుర్ఘటనలో 9 మంది భక్తులు మరణించడం అత్యంత దురదృష్టకరమని ఆయన ఆవేదన చెందారు. ఏకాదశి సందర్భంగా స్వామివారి దర్శనానికి వేలాదిగా భక్తులు పోటెత్తడంతో ఈ విషాదం జరిగిందని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. మృతుల్లో ఒక చిన్నారి కూడా ఉండటం తనను తీవ్రంగా కలచివేసిందని తెలిపారు. ఈ ఘటనలో గాయపడిన వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య చికిత్స అందేలా అన్ని చర్యలు తీసుకుంటామని, వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేసిన పవన్ కల్యాణ్, వారిని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. ఇలాంటి దురదృష్టకర సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని అధికారులకు ఆయన విజ్ఞప్తి చేశారు. ఆధ్యాత్మికంగా ప్రాముఖ్యత ఉన్న రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆలయాల వద్ద భక్తుల రద్దీని నియంత్రించి, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా తగిన భద్రతా ఏర్పాట్లు చేయాలని అధికార యంత్రాంగాన్ని కోరారు.

## ఏపీలో నేడువర్షాలు

**ఏపీఎస్డీఎంఏ అలర్ట్**

వైజాగ్, నవంబర్ 1 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో ఆదివారం పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. ముఖ్యంగా బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని, మిగతా జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి జల్లులు కురుస్తాయని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పొలాల్లో పనిచేసే రైతులు, కూలీలు, పశువుల కాపరులు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. వర్షం పడుతున్నప్పుడు చెట్ల కింద ఆశ్రయం పొందవద్దని ఆయన స్పష్టం చేశారు. మరోవైపు, ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కృష్ణా నదికి వరద ప్రవాహం కొనసాగుతోందని ప్రఖర్ జైన్ తెలిపారు. వరద ఉద్ధృతిలో రానున్న కొన్ని రోజులు హెచ్చుతగ్గులు ఉండే అవకాశం ఉందన్నారు. శనివారం సాయంత్రం 5 గంటల సమయానికి ప్రకాశం బ్యారేజీ వద్ద 1,67,175 క్యూసెక్కుల ఇన్ ఫ్లో, ఔట్ ఫ్లో నమోదైనట్లు వివరించారు. ఈ నేపథ్యంలో కృష్ణా నది పరీవాహక, లోతట్టు ప్రాంతాల ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు. పొంగిపొర్లుతున్న వాగులు, కాలువలను దాటే ప్రయత్నం చేయవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. అధికారులు అప్రమత్తంగా ఉండి, తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## ఎస్ఐఆర్ సమర్థంగా చేపట్టాలి

**రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి**

హైదరాబాద్, నవంబర్ 1 (ఈవార్తలు): స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను సమర్థవంతంగా చేపట్టాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్ నుండి రాష్ట్ర అదనపు ముఖ్య ఎన్నికల అధికారి లోకేశ్ కుమార్, ఇతర అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు- ఎన్నికల అధికారులు, ఈ ఆర్ ఓ లతో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి మాట్లాడుతూ 2002 ఎలక్టోరల్ జాబితాతో నియోజకవర్గాల వారీగా 2025 ఎలక్టోరల్ జాబితా మ్యాపింగ్ చేసి 4 కేటగిరీలుగా విభజించడం జరిగిందని, కేటగిరీ ఏ లో 1987 కంటే ముందు జన్మించి 2002, 2025 ఎలక్టోరల్ జాబితాలో నమోదు కాబడిన వారు, కేటగిరీ బీలో 1987 కంటే ముందు జన్మించి 2002 ఓటరు జాబితాలో లేకుండా 2025 జాబితాలో నమోదు కాబడిన వారు, కేటగిరీ సీ లో 1987 నుంచి 2002 మధ్యలో జన్మించి 2025 ఓటరు జాబితాలో నమోదు కాబడిన వారు, కేటగిరీ డీ లో 2002-2007 మధ్యలో జన్మించినవారిగా విభజించినట్లు తెలిపారు. మొదట కేటగిరి ఏ జాబితాను బీఎల్వో యాప్ ద్వారా నిర్ధారించుకోవడం జరుగుతుందని, ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 63 లక్షల ఓటర్లను నిర్ధారించడం జరిగిందని, మిగిలిన 12 లక్షల ఓటర్ల నిర్ధారణ త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. కేటగిరి సీ, క్యాటగిరి డీలలోని ఓటర్లను కేటగిరి ఏ కు మ్యాపింగ్ చేసే ప్రక్రియను మెరుగుపరచాలని తెలిపారు.

## వైన్ షాప్ వచ్చింది. ఉద్యోగం పోయింది

**పీఈటీగా పనిచేస్తున్న మహిళ సస్పెండ్**



మహబూబ్‌నగర్, నవంబర్ 1 (ఈవార్తలు): మహబూబ్‌నగర్ జిల్లా రాంనగర్ బాలికల ఉన్నత పాఠశాలలో పీఈటీ గా పనిచేస్తున్న పుష్ప పేరుతో ఆమె భర్త ఇటీవల మద్యం టెండర్ వేయగా వారికి ధర్మపూర్ వైన్‌షాప్ లక్కీ డిప్‌లో దక్కింది. ఇందుకు సంబంధించి పుష్ప అధికారుల సమక్షంలో సంతకం చేసి తదనంతర ప్రక్రియను సైతం పూర్తి చేశారు. అయితే ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు మద్యం టెండర్లు దక్కించుకోవడానికి అర్హులు కాదని నిబంధనలు ఉండడంతో ఓ వ్యక్తి టెండర్ల ఖరారు రోజునే అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఈ అంశం మీడియా, సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఈ నేపథ్యంలో అధికారులు ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకొని విచారణ జరిపారు. పీఈటీ పుష్ప మద్యం టెండర్ల దాఖలు నుంచి షాపు దక్కేవరకు చేసిన ప్రక్రియలకు సంబంధించి అన్ని ఆధారాలు సేకరించి నివేదించగా పరిశీలించిన జిల్లా విద్యాశాఖ అధికారి ప్రవీణ్‌కుమార్ ఇవాళ పీఈటీని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులుజారీచేశారు.



## రేవంత్‌ది రాక్షస ప్రభుత్వం

**మద్యం మీద ఉన్న మక్కువ ధాన్యం మీద లేదు**

**బీజేపీ మల్యాల మండల అధ్యక్షుడు గాజుల మల్లేశం**

మల్యాల, నవంబర్ 1 (ఈవార్తలు): రాష్ట్రంలో వరి కోతలు ప్రారంభమై నెల గడిచినా ఇంకా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని తూకం వేయకపోవడం దారుణం అని జగిత్యాల జిల్లా మల్యాల మండల బీజేపీ అధ్యక్షుడు గాజుల మల్లేశం మండిపడ్డారు. ప్రస్తుతం తెలంగాణలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వం కాదని.. రాక్షస ప్రభుత్వం అని ఫైర్ అయ్యారు. అకాల వర్షాల వల్ల రైతులు నష్టపోతే ఆదుకోవాలనే సోయి కూడా లేదని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. మంత్రులు జూబ్లీ హిల్స్ ఉపఎన్నికల్లో బిజీగా ఉన్నారని, రైతులను పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మద్యం షాపులకు రెండు నెలల ముందే నోటిఫికేషన్ జారీ చేసి ఆశావాహుల నుంచి ఆదాయం పొందడం కోసం గడువు పొడిగించిన ప్రభుత్వం.. రైతులు పండించిన పంట నెల రోజుల ముందే కోతకు వస్తుందని ఊహించి కొనుగోలు కేంద్రాలు ఎందుకు ప్రారంభించలేదని ప్రశ్నించారు. ఒకవేళ రైతుల పట్ల తెలంగాణ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉన్నట్లయితే వెంటనే ధాన్యాన్ని తూకం వేయించి తడిసిన రంగు మారిన మొలకెత్తిన ధాన్యాన్ని తరుగు తాలు ఎలాంటి ఆంక్షలు లేకుండా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులను ఆదుకోవాలని మల్యాల ఆర్ఐ తిరుపతిని వినతిపత్రం ద్వారా డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు సంగని రవి, కొల్లూరు గంగాధర్, ముదిగంటి రాజు, బొట్ల ప్రసాద్, కటకం లత, అవుదుర్తి రమ. బూరుగుపల్లి అనిల్, కోన శ్రీనివాస్, గడ్డం నాగరాజ్, పొనుగంటి గౌతం, పొన్నం సాయికుమార్, సామ మైపాల్, కిల్లిటి రమేష్, వృత్త కిషన్, గుండేటి గంగారాం, రాఘవేంద్ర, నక్కా ఆనందం, పరమేష్, సంకీర్త్, తిరుపతి, సంఘ శంకర్, కందుల వినోద్, చందు, భరత్, కుసుమ సాయి, వకులాభరణం మౌర్య బీజేపీ కార్యకర్తలుపాల్గొన్నారు.




## బీసీ రిజర్వేషన్లు పెంచే వరకు పోరాటం ఆగదు

**పెగడపల్లి బీసీ అధ్యక్షుడు నీరటి రాజ్ కుమార్**

**రిలే నిరాహార దీక్షలు ప్రారంభం**

పెగడపల్లి, నవంబర్ 1 (ఈవార్తలు): బీసీ రిజర్వేషన్లు సాధించేవరకు తమ పోరాటం ఆపబోమని జగిత్యాల జిల్లా పెగడపల్లి మండల బీసీ అధ్యక్షుడు నీరటి రాజ్ కుమార్ అన్నారు. బీసీ రిజర్వేషన్ల సాధనకై రాష్ట్ర బీసీ జేఏసీ ఆదేశాల మేరకు రిలే నిరాహార దీక్షలను ప్రారంభించారు ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు పాల్గొని మాట్లాడుతూ బీసీ జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించేంతవరకు బీసీలో పోరాటం ఆగదని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఈ రిజర్వేషన్ల ప్రక్రియను 9వ షెడ్యూల్లో చేర్చి బీసీలకు రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రతిరోజు నిర్వహించే రిలే నిరాహార దీక్షలకు పార్టీలకతీతంగా బీసీ నాయకులు మద్దతు ప్రకటించి భాగస్వాములు కావాలని కోరారు. ఈ రిలే నిరాహార దీక్షకు పెగడపల్లి గ్రామ తాజా మాజీ సర్పంచ్ మెరుగు శ్రీనివాస్ మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు నెల్లి మల్లేశం, ఉప్పు రవి, బండారి బీరయ్య, ముల్క రాజేశం, తౌటు గంగాధర్, చిందం తిరుపతి, గంగుల కొమురెల్లి, గర్వంద శేఖర్ గౌడ్, చెట్ల రాజు, తిరుమలి నరసింహారెడ్డి, కడారి తిరుపతి, గొల్లపల్లి రామచంద్రం, బొడ్డు రమేష్, పెద్ది బీరయ్య, గొల్లపల్లి నాగరాజు, ఆడెపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# 10 వేలు ఇస్తే తీసుకోండి

## ఓటు మాత్రం జాగ్రత్తగా వేయండి.. బీహార్ మహిళలకు ప్రియాంక గాంధీ పిలుపు

పాట్నా: కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా, ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బీహార్‌లో ఎన్నికల సమయంలో ఓటర్లను ప్రభావితం చేసేందుకు రూ.10,000 చొప్పున పంచుతున్నారని ఆమె సంచలన ఆరోపణలు చేశారు. శనివారం బెగుసరాయ్‌లోని బచ్‌వాడా అసెంబ్లీ నియోజకవర్గంలో జరిగిన భారీ ఎన్నికల ప్రచార సభలో ఆమె ప్రసంగించారు. "ఎన్నికలకు ముందు ఏమీ ఇవ్వని పాలకపక్షాలు, ఇప్పుడు రూ.10,000 పంచుతున్నాయి. దీని అర్థం ఏమిటి? వారికిప్పుడు మీ అవసరం పడింది, అందుకే డబ్బు పంచుతున్నారు. వాళ్లు డబ్బులిస్తే తీసుకోండి, కానీ మీ ఓటును మాత్రం చాలా జాగ్రత్తగా వేయండి. మీ ఓటును వాళ్లు కొనడానికి వీల్లేదు" అని ప్రియాంక ప్రజలకు పిలుపునిచ్చారు. తాము కూడా హామీలు ఇస్తున్నామని, ఒకవేళ వాటిని నెరవేర్చకపోతే తమను అధికారంలోంచి దించేయవచ్చని ఆమె స్పష్టం చేశారు. బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌పై ప్రియాంక తీవ్ర విమర్శలు చేశారు. "గత 20 ఏళ్లుగా ఆయన బీహార్‌ను పాలిస్తున్నారు. ఇప్పుడు 1.5 కోట్ల ఉద్యోగాలు ఇస్తానంటున్నారు. మరి ఇన్నేళ్లుగా ఎందుకు ఇవ్వలేదు? ప్రజలను అమాయకులు అనుకుంటున్నారా?" అని ఆమె ప్రశ్నించారు. ధరల పెరుగుదల, నిరుద్యోగం వంటి అంశాలపై ఎన్డీయే ఇచ్చిన హామీలను గాలికొదిలేసిందని, దేశంలోని పెద్ద కంపెనీలను తమ పారిశ్రామికవేత్త మిత్రులకు అప్పగించి, సామాన్యులకు ఏమీ ఇవ్వలేదని ఆరోపించారు.

### ఢిల్లీ సింగిల్ ఇంజిన్

బీజేపీ "డబుల్ ఇంజిన్" నినాదాన్ని ఆమె ఎద్దేవా చేశారు. "నరేంద్ర మోదీ డబుల్ ఇంజిన్ ప్రభుత్వం నడుపుతామంటున్నారు. నేను మీకు చెప్పాలనుకుంటున్నాను.. వాళ్లది డబుల్ ఇంజిన్ కాదు. అది ఢిల్లీ నుంచి నడిచే సింగిల్ ఇంజిన్. ఇక్కడ మీ మాటకే కాదు, మీ ముఖ్యమంత్రి మాటకు కూడా విలువ లేదు" అని ప్రియాంక విమర్శించారు. మోదీ, అమిత్ షా పాలనలో బీహార్ ప్రజలు జీవనోపాధి కోసం ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లాల్సి వస్తోందని, ప్రభుత్వం మారితేనే ఈ వలసలు ఆగుతాయని అన్నారు. దేశంలో 65 లక్షల ఓట్లను అక్రమంగా తొలగించారని ప్రియాంక ఆరోపించారు. "మీ ఓటును తొలగిస్తే, మీ హక్కును కాలరాసినట్లే"



అని ఆమె అన్నారు. బీజేపీ నేతలను ఓట్ల దొంగలు అని అభివర్ణించిన ఆమె, మొదట మతం, కులం పేరుతో ప్రజలను విభజించారని, ఇప్పుడు ప్రజలు మేల్కోవడంతో ఓట్లను దొంగిలించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. కులగణన ఆవశ్యకతను వివరిస్తూ, రాహుల్ గాంధీ సామాజిక న్యాయం గురించి మాట్లాడితే బీజేపీ నేతలంతా వ్యతిరేకించారని గుర్తు చేశారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఆశించిన ఫలితాలు రాకపోవడంతో బీజేపీ కులగణనపై మాట మార్చిందని, ఆ తర్వాత కోర్టుకు వెళ్లి దాన్ని అడ్డుకుందని ఆరోపించారు. దేశంలో ఐఐటీలు, ఐఐఎంలు, ఎయిమ్స్‌లను జవహర్‌లాల్ నెహ్రూ నిర్మించారని, గతం గురించి మాట్లాడితే బీజేపీ వాదనలు నిలబడవని ఆమె అన్నారు.

# మాల్దీవ్స్‌లో 2007 తర్వాత పుట్టినోళ్లకు పొగాకు బంద్

మాల్దీవ్స్: పొగాకు వినియోగాన్ని నియంత్రించే దిశగా మాల్దీవులు ప్రభుత్వం ఒక చారిత్రక నిర్ణయం తీసుకుంది. దేశంలో 'ఒక తరానికి నిషేధం' విధిస్తూ పొగాకు నియంత్రణ చట్టానికి చేసిన కీలక సవరణలను శనివారం నుంచి అధికారికంగా అమలు చేసింది. దీని ప్రకారం, నిర్దిష్ట సంవత్సరం తర్వాత పుట్టిన వారికి పొగాకు వాడకంపై జీవితకాలం నిషేధం ఉంటుంది. కొత్త నిబంధనల ప్రకారం, 2007వ సంవత్సరం జనవరి 1వ తేదీ లేదా ఆ తర్వాత జన్మించిన వ్యక్తులు పొగాకు ఉత్పత్తులను వినియోగించడంపై నిషేధం విధించారు. అంతేకాకుండా, 21 ఏళ్లలోపు వయసున్న వారికి లేదా ఈ తరం నిషేధం పరిధిలోకి వచ్చేవారికి పొగాకు ఉత్పత్తులను విక్రయించడం కూడా చట్టవిరుద్ధమని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ కొత్త చట్టంతో పాటు దేశవ్యాప్తంగా ఎలక్ట్రానిక్ సిగరెట్లు (ఈ-సిగరెట్లు), వేపింగ్ ఉత్పత్తులపై కూడా సంపూర్ణ నిషేధం అమల్లోకి వచ్చింది. సమర్థులైన, నైతిక విలువలు కలిగిన, శ్రద్ధగల పౌరులను తీర్చిదిద్దాలన్న అధ్యక్షుడు మొహమ్మద్ ముయిజ్జు దార్శనికతకు అనుగుణంగానే ఈ చర్యలు తీసుకున్నట్లు అక్కడి ప్రభుత్వ మీడియా సంస్థ పీఎస్‌ఎమ్ న్యూస్ వెల్లడించింది. ఈ-సిగరెట్లు, వేపింగ్ పరికరాలు, వాటికి సంబంధించిన ఉపకరణాల వాడకం, దిగుమతి, తయారీ, కలిగి ఉండటాన్ని కూడా ఈ చట్టం నిషేధిస్తోంది. గత ఏడాది డిసెంబరులోనే వేపింగ్ పరికరాల వాడకం, అమ్మకాలపై మాల్దీవుల ప్రభుత్వం నిషేధం విధించిన విషయం తెలిసిందే. 2024 నవంబర్ 13న అధ్యక్షుడు ముయిజ్జు ఆమోదించిన చట్ట సవరణల మేరకు, 2024 డిసెంబర్ 15 నుంచి వేపింగ్ పరికరాలపై నిషేధం అమలైంది. నిబంధనలు ఉల్లంఘించి ఎవరైనా వేపింగ్ పరికరాలను దిగుమతి చేస్తే వారికి 50,000 మాల్దీవియన్ రుఫియాల (సుమారు 3,250 అమెరికన్ డాలర్లు) జరిమానా విధిస్తారు. పొగాకు, వేపింగ్‌పైనే కాకుండా మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టేందుకు కూడా మాల్దీవుల ప్రభుత్వం తన ప్రయత్నాలను ముమ్మరం చేసింది. ఇటీవల పొరుగు దేశమైన శ్రీలంక కూడా అక్రమంగా దిగుమతి చేసుకున్న రూ.1.2 బిలియన్ల విలువైన విదేశీ సిగరెట్లను ధ్వంసం చేయడం ఈ ప్రాంతంలో మాదకద్రవ్యాల నియంత్రణపై ప్రభుత్వాలు చూపుతున్న శ్రద్ధకు నిదర్శనంగా నిలుస్తోంది.

# ఢిల్లీ పేరు మార్చండి

**అమిత్ షా, రేఖా గుప్తాకు బీజేపీ ఎంపీ లేఖ**

న్యూఢిల్లీ: ఢిల్లీ పేరు మార్చాలని కోరుతూ బీజేపీ ఎంపీ ప్రవీణ్ ఖండేల్‌వాలా కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు లేఖ రాశారు. ఢిల్లీ పేరు మార్చాలనే డిమాండ్లు ఈ మధ్య బాగా వినిపిస్తున్నాయి. ఈ నగరం పేరును 'ఇంద్రప్రస్థ'గా మార్చాలని విశ్వహిందూ పరిషత్ ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తోంది. తాజాగా ఒక ఎంపీ లేఖ రాయడం చర్చనీయాంశమైంది. ఢిల్లీ పేరును 'ఇంద్రప్రస్థ'గా మార్చడం ద్వారా అది చారిత్రక, సాంస్కృతిక, నాగరికత మూలాలను ప్రతిబింబిస్తుందని ప్రవీణ్ ఖండేల్‌వాలా పేర్కొన్నారు. నగరంలోని పాత రైల్వే స్టేషన్, అంతర్జాతీయ విమానాశ్రయాల పేర్లను కూడా మార్చాలని బీజేపీ ఎంపీ ఆ లేఖలో కోరారు. దేశ రాజధానిలో పాండవుల విగ్రహాలను ఏర్పాటు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రయాగ్‌రాజ్, అయోధ్య, ఉజ్జయిని, వారణాసి వంటి నగరాల పేర్లు వాటి మూలాలకు అనుగుణంగా ఉన్నాయని, అలాంటప్పుడు దేశ రాజధాని పేరు కూడా అలా ఎందుకు ఉండకూడదని ఆయన ప్రశ్నించారు.

# నితీశే మా సీఎం అభ్యర్థి

**160 సీట్లు గెలుస్తాం: అమిత్ షా**



పాట్నా: బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి విజయం సాధిస్తుందని, నితీశ్ కుమార్ తమ ముఖ్యమంత్రి అభ్యర్థి అని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. ఎన్డీటీవీ నిర్వహించిన బీహార్ పవర్ ప్లే కాన్‌క్లేవ్‌లో ఆయన మాట్లాడుతూ, రాజకీయ అవగాహన కలిగిన రాష్ట్రాలలో బీహార్ ఒకటని అన్నారు. ఈ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఎన్డీయేకు అనుకూలంగా ఉంటాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఎన్నికల తేదీలను ప్రకటించకముందే బూత్ స్థాయి నుంచి పాట్నా వరకు అన్ని పార్టీలు ప్రచారం ప్రారంభించాయని తెలిపారు. గత 20 ఏళ్లలో బీహార్‌లో అభివృద్ధికి పునాది వేశామని ఆయన పేర్కొన్నారు. నితీశ్ కుమార్ పాలనలో రాష్ట్రంలో శాంతిభద్రతలు మెరుగుపడ్డాయని ప్రజలందరూ చెబుతున్నారని అమిత్ షా అన్నారు. గంగానదిపై నాలుగు వంతెనలు నిర్మించామని, మరో పది వంతెనలు నిర్మాణంలో ఉన్నాయని, ఇది సాధ్యమవుతుందని ఎవరూ ఊహించలేదని తెలిపారు. గతంలో దోపిడీలు, హత్యలు జరిగేవని, ఎన్డీయే హయాంలో అవి ఆగిపోయి అభివృద్ధి జరిగిందని ఆయన అన్నారు. ఉపాధి అవకాశాలను వివిధ మార్గాల్లో సృష్టించవచ్చని అమిత్ షా అన్నారు. తేజస్వి యాదవ్ 2 కోట్లకు పైగా ఉద్యోగాలు ఇస్తామని చెబుతున్నారని, అది బీహార్ బడ్జెట్‌ను చూస్తే సాధ్యం కాదని అన్నారు. ఆ హామీని నెరవేర్చడానికి ప్రస్తుత రాష్ట్ర బడ్జెట్ కంటే నాలుగు రెట్లు ఎక్కువ అవసరమని ఆయన పేర్కొన్నారు. బీహార్ నుంచి వలసలు తగ్గాలంటే ఇక్కడే స్వయం ఉపాధి అవకాశాలు సృష్టించాలని అమిత్ షా సూచించారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో తాము నితీశ్ కుమార్ నాయకత్వంలోనే ముందుకు వెళుతున్నామని చాలాసార్లు స్పష్టం చేశామని అమిత్ షా అన్నారు. ఎన్డీయే గెలుస్తుందని, ఆయనే ముఖ్యమంత్రి అని ఆయన పునరుద్ఘాటించారు. గెలిచిన తర్వాత రాజ్యాంగ ప్రక్రియ ప్రకారం ముందుకు వెళతామని తెలిపారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో 160 సీట్లలో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. మిగిలిన సీట్లను ప్రతిపక్షాలు, ఇతర పార్టీలు పంచుకుంటాయని ఆయన అన్నారు. గత ఐదేళ్లలో ఏం చేశాం, తదుపరి ఐదేళ్లలో ఏం చేస్తామనే విషయాన్ని ప్రజలకు స్పష్టంగా చెప్పాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. తమ బలం గురించి ఆలోచించకుండా, కూటమి భాగస్వాములతో కలిసి పనిచేయడమే బీజేపీ విధానమని ఆయన స్పష్టం చేశారు. మహాఘట్‌బంధన్ అధికారంలోకి వస్తే తిరిగి జంగిల్ రాజ్ వస్తుందని హెచ్చరించారు. బీహార్ ప్రజలు ఓటు వేసేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని ఆయన కోరారు.

# ఇంగ్లీష్, హిందీ డేంజర్

**ఈ భాషలు దక్షిణాది పిల్లల నైపుణ్యాలు దెబ్బతీస్తున్నాయి**


**కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కీలక వ్యాఖ్యలు**



బెంగళూరు: దక్షిణాది రాష్ట్రాల్లో హిందీ, ఇంగ్లీష్ భాషలు పిల్లల నైపుణ్యాలను బలహీనపరుస్తున్నాయని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య వ్యాఖ్యానించారు. విద్యాసంస్థల్లో మాతృభాషను ప్రోత్సహించేలా కేంద్ర ప్రభుత్వం చట్టం తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వానికి, దక్షిణాది రాష్ట్రాలకు హిందీ భాష విషయంలో మాటల యుద్ధం కొనసాగుతున్న తరుణంలో సిద్ధరామయ్య చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. కర్ణాటక రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం కర్ణాటకపై సవతి తల్లి ప్రేమను ప్రదర్శిస్తూ హిందీని బలవంతంగా రుద్దే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. అభివృద్ధి చెందిన దేశాలలో పిల్లలు తమ మాతృభాషలోనే విద్యను అభ్యసిస్తారని, మన దేశంలో మాత్రం అందుకు విరుద్ధంగా ఉందని ఆయన అన్నారు. ఇంగ్లీష్, హిందీ భాషలు పిల్లల నైపుణ్యాలపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మాతృభాషను బోధనా మాధ్యమంగా ప్రవేశపెడుతూ కేంద్రం చట్టం తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. విద్య విషయంలో కన్నడ భాష పట్ల జరుగుతున్న నిర్లక్ష్యం రాష్ట్రంలో అనేక సమస్యలకు కారణమవుతోందని ఆయన అభిప్రాయపడ్డారు. హిందీ, సంస్కృత భాషాభివృద్ధికి నిధులు కేటాయిస్తున్న కేంద్రం, దేశంలోని ఇతర మాతృభాషల అభివృద్ధికి మాత్రం గ్రాంట్లు మంజూరు చేయడం లేదని ఆయన ఆరోపించారు. కన్నడను వ్యతిరేకించే వారిని రాష్ట్ర ప్రజలు కూడా వ్యతిరేకించాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్రం నుంచి కేంద్రానికి రూ. 4.5 లక్షల కోట్ల ఆదాయం వెళుతున్నప్పటికీ, కేంద్రం నుంచి మాత్రం కర్ణాటక అభివృద్ధికి తగిన నిధులు రావడం లేదని ఆయన ఆరోపించారు.

# భారత్‌కు మూడు గిన్నిస్ రికార్డులు

**మహిళల ఆరోగ్య సంరక్షణలో అవార్డులు**




న్యూఢిల్లీ: మహిళల ఆరోగ్య సంరక్షణ రంగంలో భారత్ సరికొత్త చరిత్ర సృష్టించింది. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన 'స్వస్థ్ నారి సశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమం ఏకంగా మూడు గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ టైటిళ్లను కైవసం చేసుకుంది. ఈ కీలక విషయాన్ని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జేపీ నడ్డా శనివారం అధికారికంగా ప్రకటించారు. ఈ మేరకు ఆయన ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ఓ పోస్ట్ చేశారు. "మహిళల ఆరోగ్యానికి రికార్డు స్థాయి మైలురాయి! 'స్వస్థ్ నారి సశక్త్ పరివార్ అభియాన్' ద్వారా భారత్ మూడు గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ సాధించింది. ఇది మహిళా కేంద్రక, నివారణ ఆరోగ్య సంరక్షణ పట్ల మా నిబద్ధతను మరోసారి చాటుతోంది" అని ఆయన పేర్కొన్నారు. పోషణ్ మాహ్ కార్యక్రమంలో భాగంగా ఈ ఏడాది సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలు, కౌమార బాలికలు, చిన్నారులలో ఆరోగ్యం, పోషకాహార విలువలను మెరుగుపరచడమే లక్ష్యంగా ఈ ప్రచారం సాగింది. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో 19.7 లక్షలకు పైగా ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేయగా, 11 కోట్లకు పైగా ప్రజలు వీటి ద్వారా సేవలు పొందారని నడ్డా వివరించారు. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ, మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టాయి. ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు, ఆరోగ్య నిపుణుల భాగస్వామ్యంతో 'జన భాగస్వామ్య అభియాన్'గా దీనిని తీర్చిదిద్దారు. దేశంలోని మారుమూల ప్రాంతాలకు సైతం ఆరోగ్య సేవలను చేర్చడంలో అంగన్‌వాడీల వంటి వేదికలను సమర్థవంతంగా వినియోగించుకున్నారు. ఈ శిబిరాల్లో భాగంగా చర్మ సంబంధిత వ్యాధులు, రక్తపోటు (హైపర్‌టెన్షన్), రక్తహీనత (అనీమియా), పునరుత్పత్తి ఆరోగ్య సమస్యలు, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్, మధుమేహం (డయాబెటిస్), క్షయ (టీబీ), సికిల్ సెల్ వ్యాధి వంటి వాటిపై ప్రత్యేకంగా పరీక్షలు నిర్వహించారు. గిరిజన ప్రాంతాల్లో వారికి అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కౌన్సెలింగ్ సెషన్లు కూడా ఏర్పాటు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ స్ఫూర్తితో 'సేవ, భారత్ ఫస్ట్' అనే నినాదంతో చేపట్టిన ఈ కార్యక్రమం.. 'స్వస్థ్ నారి, సశక్త్ పరివార్, వికసిత్ భారత్' లక్ష్య సాధనలో ఒక గర్వకారణమైన ముందడుగు అని జేపీ నడ్డా తన పోస్టులో పేర్కొన్నారు.

# కాస్త తగ్గిన వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర

ముంబై/న్యూఢిల్లీ: హొటళ్లు, రెస్టారెంట్లు వంటి వాణిజ్య అవసరాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్ వినియోగదారులకు చమురు మార్కెటింగ్ కంపెనీలు స్వల్ప ఊరట కల్పించాయి. 19 కిలోల కమర్షియల్ ఎల్పీజీ సిలిండర్ ధరను 5 రూపాయల మేర తగ్గిస్తున్నట్లు ప్రకటించాయి. సవరించిన ఈ కొత్త ధరలు నవంబర్ 1వ తేదీ నుంచే దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చాయి. ప్రతి నెల మొదటి తేదీన చమురు సంస్థలు గ్యాస్ సిలిండర్ల ధరలను సమీక్షిస్తుంటాయి. ఈ ప్రక్రియలో భాగంగా ఈరోజు వాణిజ్య సిలిండర్ ధరను తగ్గించాయి. తాజా తగ్గింపుతో దేశ రాజధాని ఢిల్లీలో 19 కిలోల సిలిండర్ ధర రూ.1,595.50 నుంచి రూ.1,590.50కి చేరింది. ఇతర ప్రధాన నగరాల్లో ధరలను పరిశీలిస్తే.. కోల్‌కతాలో రూ.1,694, ముంబైలో రూ.1,542, చెన్నైలో రూ.1,750గా ఉంది. ఇక మన హైదరాబాద్‌లో కమర్షియల్ సిలిండర్ కొత్త ధర రూ.1,812.50గా నమోదైంది. అయితే, ఈ తగ్గింపు కేవలం వాణిజ్య సిలిండర్లకు మాత్రమే పరిమితమైంది. ఇళ్లలో వంట కోసం ఉపయోగించే 14.2 కిలోల గృహ వినియోగ సిలిండర్ ధరలో మాత్రం ఎలాంటి మార్పు చేయలేదు. ప్రస్తుతం దేశంలోని ప్రధాన నగరాల్లో డొమెస్టిక్ సిలిండర్ ధర రూ.850 నుంచి రూ.960 మధ్య స్థిరంగా కొనసాగుతోంది.

# ప్రజల కోసమే పనిచేశా

**కుటుంబం కోసం ఏమీ చేయలేదు.. సీఎం నితీశ్ వీడియో సందేశం**



పాట్నా: బీహార్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సీఎం నితీశ్ కుమార్ శనివారం ప్రజల కోసం ఒక ప్రత్యేక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. 2005 నుంచి తాను రాష్ట్ర ప్రజలకు నిజాయితీగా, కష్టపడి సేవ చేశానని పేర్కొంటూ.. రానున్న ఎన్నికల్లో తమకే మరో అవకాశం ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మూడు నిమిషాల నిడివి ఉన్న ఈ వీడియోలో నితీశ్ కుమార్ మాట్లాడుతూ... "నా ప్రియమైన బీహార్ సోదర సోదరీమణులారా, 2005 నుంచి నాకు సేవ చేసే అవకాశం ఇచ్చారు. నేను మీకు చెప్పాలనుకుంటున్నది ఏమిటంటే, మేము అధికారం చేపట్టే నాటికి బీహార్ పరిస్థితి దారుణంగా ఉండేది. ఆ రోజుల్లో బిహారీగా చెప్పుకోవడం ఒక అవమానంగా భావించేవారు. అప్పటి నుంచి రేయింబవళ్లు నిజాయితీగా, కష్టపడి మీ కోసం పనిచేశాను" అని అన్నారు. గత ప్రభుత్వాలు మహిళల కోసం ఏమీ చేయలేదని, కానీ తమ ప్రభుత్వం మహిళలను ఎవరిపైనా ఆధారపడని విధంగా శక్తిమంతులుగా తీర్చిదిద్దిందని ఆయన తెలిపారు. విద్య, ఆరోగ్యం, రహదారులు, విద్యుత్, తాగునీరు, వ్యవసాయం, యువతకు అవకాశాలు వంటి అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించామని వివరించారు. "హిందూ, ముస్లిం, అగ్రవర్ణాలు, వెనుకబడిన వర్గాలు, దళితులు, మహాదళితులు అనే తేడా లేకుండా సమాజంలోని అన్ని వర్గాల కోసం మేము పనిచేశాం. నా రాజకీయ జీవితంలో ప్రజల కోసమే పనిచేశా, కుటుంబం కోసం ఏమీ చేయలేదు" అని నితీశ్ కుమార్ పేర్కొన్నారు. 2024లో బీజేపీతో కలిసి రికార్డు స్థాయిలో తొమ్మిదోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన నితీశ్, "ఒకప్పుడు అవమానంగా ఉన్న 'బిహారీ' అనే పదం ఇప్పుడు గౌరవంగా మారింది" అని అన్నారు. "మాకు మరో అవకాశం ఇవ్వండి. బీహార్‌ను దేశంలోని అగ్రగామి రాష్ట్రాల్లో ఒకటిగా నిలిపేందుకు మరింతగా కృషి చేస్తాం" అని కోరుతూ ఎన్డీఏ అభ్యర్థులకు ఓటు వేయాలని ప్రజలను అభ్యర్థించారు. కాగా, 243 స్థానాలున్న బీహార్ అసెంబ్లీకి ఈ నెల 6, 11 తేదీల్లో రెండు విడతల్లో ఎన్నికలు జరగనున్నాయి. నవంబర్ 14న ఓట్ల లెక్కింపు చేపడతారు.

# వస్తే 10.. లేకపోతే 150

**సొంత పార్టీ జన్ సురాజ్‌కు సీట్లపై పీకే జోస్యం**

పాట్నా: బీహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై ఎన్నికల వ్యూహకర్త, జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. రాబోయే ఎన్నికల్లో తమ పార్టీకి 150కి పైగా సీట్లు వస్తాయని, ఒకవేళ ఆ మార్కును అందుకోలేకపోతే 10 కంటే తక్కువ సీట్లకే పరిమితమవుతుందని ఆసక్తికర జోస్యం చెప్పారు. ఓ జాతీయ మీడియా సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఎన్నికలకు ముందుగానీ, ఎన్నికల తర్వాత గానీ ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకునే ప్రసక్తే లేదని పీకే తేల్చి చెప్పారు. "ప్రస్తుతం బీహార్‌లోని 160–170 స్థానాల్లో త్రిముఖ పోటీ నెలకొంది. మా పార్టీ 150కి పైగా స్థానాల్లో గెలుస్తుందన్న పూర్తి విశ్వాసం నాకుంది. రాష్ట్ర ప్రజలు జన్ సురాజ్‌ను ఓ బలమైన ప్రత్యామ్నాయంగా చూస్తున్నారు" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. తాను ఎన్నికల్లో పోటీ చేయకపోవడం పట్ల ప్రజల్లో కొంత నిరాశ ఉందని పీకే అంగీకరించారు. అయితే, తాను ఎన్నికల్లో పోటీ చేస్తానని ఎప్పుడూ చెప్పలేదని గుర్తుచేశారు. "ఒకవేళ పోటీ చేస్తే కార్‌గఢ్ నుంచి చేస్తానని గతంలో అన్నాను. కానీ, అది కూడా నిజం కాదని అప్పుడే స్పష్టం చేశాను" అని తెలిపారు. బీహార్‌లోని మూడింట ఒక వంతు ప్రజలు ప్రస్తుత అధికార, ప్రతిపక్ష కూటములకు ఓటు వేయకూడదని నిర్ణయించుకున్నారని, వారికి తమ పార్టీయే సరైన ప్రత్యామ్నాయమని పీకే వివరించారు. కాగా, బీహార్ అసెంబ్లీ ఎన్నికలు రెండు విడతల్లో జరగనున్నాయి. నవంబర్ 6, 11 తేదీల్లో పోలింగ్ నిర్వహించనుండగా, నవంబర్ 14న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను వెల్లడిస్తారు. ఈ ఎన్నికల్లో అధికార ఎన్డీఏ కూటమి, ప్రతిపక్ష ఇండియా కూటమి మధ్య ప్రధాన పోటీ నెలకొంది. ఈ నేపథ్యంలో జన్ సురాజ్ పార్టీ ఎన్ని సీట్లు గెలుస్తుందనేది ఆసక్తికరంగా మారింది.



# తీవ్ర పేదరికానికి చరమగీతం

**దేశంలోనే తొలి రాష్ట్రంగా కేరళ!**

తిరువనంతపురం: కేరళ రాష్ట్రం ఒక చారిత్రక మైలురాయిని అందుకుంది. రాష్ట్రంలో తీవ్ర పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించినట్టు ముఖ్యమంత్రి పినరయి విజయన్ అధికారికంగా ప్రకటించారు. కేరళ ఆవిర్భావ దినోత్సవమైన నవంబర్ 1న, శనివారం నాడు శాసనసభ వేదికగా ఆయన ఈ ప్రకటన చేశారు. ఈ ఘనత సాధించిన దేశంలోనే తొలి రాష్ట్రం కేరళ అని ఎల్డీఎఫ్ ప్రభుత్వం స్పష్టం చేసింది. 2021లో రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన "తీవ్ర పేదరిక నిర్మూలన ప్రాజెక్టు" విజయవంతం కావడంతో ఈ ఫలితం సాధ్యమైంది. ఈ ప్రాజెక్టు కింద రాష్ట్రవ్యాప్తంగా 64,006 కుటుంబాలను 'అత్యంత నిరుపేద' కుటుంబాలుగా గుర్తించారు. ఆ తర్వాత వారిని పేదరికం నుంచి బయటకు తీసుకువచ్చేందుకు నాలుగేళ్ల లక్ష్యంతో ప్రత్యేక పథకాలను అమలు చేశారు. ఈ విజయం వెనుక ఉన్న ప్రణాళికను స్థానిక స్వపరిపాలన శాఖ మంత్రి ఎం.బి.రాజేశ్ ఇటీవల వివరించారు. నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం దేశంలోనే అత్యల్ప పేదరిక రేటు (0.7 శాతం) కేరళలో ఉందని తేలిందని, అయితే ఆ కొద్దిమందిని కూడా ఆదుకోవాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామని ఆయన తెలిపారు. ఆహారం, ఆరోగ్యం, నివాసం, జీవనోపాధి వంటి సూచికల ఆధారంగా క్షేత్రస్థాయిలో సర్వేలు నిర్వహించి అత్యంత నిరుపేదలను గుర్తించినట్టు చెప్పారు. ఈ సర్వేల ద్వారా 64,006 కుటుంబాలకు చెందిన 1,03,099 మందిని గుర్తించి వారికి అవసరమైన అన్ని రకాల సహాయాన్ని ప్రభుత్వం అందించింది.

వయ్యారి చిత్రం


మాళవిక మోహనన్




కల్కి.. ఇయర్ ఆఫ్ ది ఫిల్మ్!
ఉత్తమ నటుడిగా కార్తీక్ ఆర్యన్
ఉత్తమ నటిగా కృతి సనన్
ఉత్తమ చిత్రంగా స్త్రీట్ 2

## దాదాసాహెబ్ ఫాల్కే ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ అవార్డ్స్ 2025



దాదాసాహెబ్ ఫాల్కే ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ అవార్డ్స్ 2025 విజేతలను ముంబైలో జరిగిన కార్యక్రమంలో ప్రకటించారు. ఇందులో బాలీవుడ్ నటుడు కార్తీక్ ఆర్యన్,విక్రాంత్ మాస్సే, వరుణ్ ధావన్,కృతి సనన్ లు బెస్ట్ యాక్టర్, యాక్ట్రెస్ లుగా నిలిచారు. దాదాసాహెబ్ ఫాల్కే ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ అవార్డ్స్ 2025 లో స్త్రీ -2 మూవీ ఉత్తమ సినిమాగా.. ఫిల్మ్ ఆఫ్ ది ఇయర్ గా కల్కి 2898%ూణ% మూవీ అవార్డు అందుకోగా.. ఉత్తమ వెబ్ సిరీస్ గా పంచాయత్ 3.. ఉత్తమ నటుడిగా కార్తీక్ ఆర్యన్ లు అవార్డులను అందుకున్నారు. చలనచిత్రం, టెలివిజన్ పరిశ్రమలకు చెందిన అనేక మంది ప్రముఖులు అవార్డు ఫంక్షన్ లో హాజరయ్యారు. అలా దాదాసాహెబ్ ఫాల్కే ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్ అవార్డులలో ఎవరెవరికి ఏ విభాగంలో అవార్డులు వచ్చాయో ఇప్పుడు చూద్దాం.. ఉత్తమ సినిమాగా బాలీవుడ్ మూవీ స్త్రీ-2 కు దాదాసాహెబ్ ఫాల్కే ఇంటర్నేషనల్ అవార్డు వచ్చింది. ఉత్తమ నటుడిగా కార్తిక్ ఆర్యన్.. ఉత్తమ నటిగా కృతి సనన్..ఉత్తమ దర్శకుడిగా చందు.. ఛాంపియన్ మూవీకి దర్శకత్వం వహించిన కబీర్ ఖాన్ కి ఈ అవార్డు వరించింది.అలాగే ప్రభాస్ హీరోగా నటించిన కల్కి 2898 ఏడీ ఉత్తమ మూవీకి ఫిల్మ్ ఆఫ్ ది ఇయర్ గా దాదాసాహెబ్ ఫాల్కే ఇంటర్నేషనల్ అవార్డు వరించింది. ఉత్తమ నిర్మాతగా దినేష్ విజన్ అవార్డు అందుకున్నారు.



- ఉత్తమ క్రిటిక్స్ మూవీగా లపాటా లేడీస్
- ఉత్తమ క్రిటిక్ యాక్టర్ గా విక్రాంత్ మాస్సే(సెక్టర్ 36)
- ఉత్తమ క్రిటిక్స్ హీరోయిన్ గా నితాన్షి గోయల్ (లాపాటా లేడీస్)
- ఉత్తమ ఇంటర్నేషనల్ ఫీచర్ ఫిల్మ్ గా ఎమిలియా పెరెజ్
- ఉత్తమ అంతర్జాతీయ నటిగా కార్లా సోఫియా గాస్కాన్
- ఉత్తమ అంతర్జాతీయ నటుడిగా కోల్మన్ డొమింగో
- ఉత్తమ వెబ్ సిరీస్ గా హీరామండీ
- ఉత్తమ వెబ్ సిరీస్ నటుడిగా జితేంద్ర కుమార్(పంచాయత్ 3)
- ఉత్తమ వెబ్ సిరీస్ నటిగా హుమా ఖురేషి
- ఉత్తమ వెబ్ సిరీస్ డైరెక్టర్గా సంజయ్ లీలా బన్సాలీ (హీరామండి)
- ఉత్తమ క్రిటిక్స్ వెబ్ సిరీస్ గా పంచాయత్ సీజన్ 3
- ఉత్తమ క్రిటిక్స్ వెబ్ సిరీస్ నటుడిగా వరుణ్ ధావన్
- ఉత్తమ క్రిటిక్స్ వెబ్ సిరీస్ నటిగా సోనాక్షి సిన్హా
- బెస్ట్ మ్యూజిక్ డైరెక్టర్ గా దేవిశ్రీప్రసాద్ (పుష్ప-2)
- ఆర్టిస్ట్ ఆఫ్ ది ఇయర్ అవార్డు ఏఆర్ రెహమాన్
- పెర్ఫామర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు స్టెబిన్ బెన్
- టెలివిజన్ సిరీస్ ఆఫ్ ది ఇయర్ అవార్డు యే రిష్తా క్యా కెహ్లాతా హై
- బెస్ట్ టెలివిజన్ యాక్టర్ గా అర్జిత్ తనేజా
- బెస్ట్ టెలివిజన్ నటిగా దీపిక సింగ్

## పెద్ది.. టార్గెట్ నెక్స్ట్ లెవెల్




చరణ్, డైరెక్టర్ బుచ్చిబాబు దర్శకత్వంలో వస్తున్న సినిమా.. పెద్ది. పెద్ది సినిమా కోసం చాలా కాలంపాటూ వెయిట్ చేసిన బుచ్చి, ఈ సినిమాతో డైరెక్టర్ గా నెక్స్ట్ లెవెల్ కు వెళ్లాలని ప్లాన్ చేశారు. అందులో భాగంగానే పెద్ది కోసం ప్రతీదీ చాలా భారీగా ప్లాన్ చేస్తూ వస్తున్నారు. హీరోయిన్ గా బాలీవుడ్ నుంచి జాన్వీ కపూర్ ను ఎంపిక చేసిన బుచ్చిబాబు, ఓ కీలక పాత్ర కోసం కన్నడ స్టార్ శివ రాజ్‌కుమార్‌ను తీసుకున్నారు. ఇక సంగీతం కోసం ఆస్కార్ విన్నర్ ఏఆర్ రెహమాన్ ను ఒప్పించడమే కాకుండా సెట్స్ పైకి వెళ్లకముందే పెద్ది కోసం నాలుగు ట్యూన్లను కంపోజ్ చేయించుకున్నారు. ఇదిలా ఉంటే ఈ సినిమా గురించి ఇప్పుడో ఇంట్రెస్టింగ్ అప్డేట్స్ వినిపిస్తున్నాయి. పెద్ది నెక్స్ట్ షెడ్యూల్ నవంబర్ 4 నుంచి హైదరాబాద్ లోని రామోజీ ఫిల్మ్ సిటీలో మొదలవనుందని, ఈ షెడ్యూల్ షూటింగ్ కోసం చరణ్ సరికొత్త లుక్ లో కనిపించనున్నారని తెలుస్తోంది. అంతేకాదు, రానున్న రెండు వారాల్లో పెద్దికి సంబంధించి రెండు కొత్త అప్డేట్స్ రానున్నాయని, ఆ అప్డేట్స్ కచ్చితంగా సోషల్ మీడియాను ఉర్రూతలూగించడం ఖాయమని చిత్ర యూనిట్ సభ్యులంటున్నారు. వచ్చే ఏడాది చరణ్ బర్త్ డే సందర్భంగా మార్చి 27న ప్రేక్షకుల ముందుకు రానున్న పెద్ది సినిమా నుంచి త్వరలోనే ఫస్ట్ సింగిల్ రానుందని సమాచారం.




## రెడీ అయ్యేందుకే 3 గంటలు: సోనాక్షి

ఒక్కోసారి కొన్ని పాత్రలు ఎంత నచ్చినా అవి చేయడానికి మాత్రం ఎంతో కష్టపడాల్సి వస్తుంది. అయితే ఏ సినిమాలో అయినా హీరోల కష్టంతో పోలిస్తే హీరోయిన్లకు కష్టపడేది తక్కువే ఉంటుంది. చాలా తక్కువ సమయాల్లో మాత్రమే హీరోయిన్ కూడా కష్టపడాల్సి వస్తోంది. ఇప్పుడు బాలీవుడ్ భామ సోనాక్షి సిన్హాకు కూడా అలాంటి కష్టమే ఎదురైనట్టు చెప్పుకొచ్చారు. సోనాక్షి సిన్హా టాలీవుడ్ ఎంట్రీ ఇస్తూ చేసిన మొదటి సినిమా జటాధర. సుధీర్ బాబు హీరోగా నటించిన జటాధర నవంబర్ 7వ తేదీన ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. జటాధరలో సోనాక్షి ఫీమేల్ లీడ్ గా నటిస్తుండగా, ఈ సినిమాలోని పాత్ర కోసం తానెంత కష్టపడాల్సి వచ్చిందోననే విషయాన్ని చిత్ర ప్రమోషన్స్ సందర్భంగా ఆమె వెల్లడించారు. ఎన్నో సినిమాల్లో నటించిన సోనాక్షికి తన కెరీర్లోనే జటాధరలో చేసిన క్యారెక్టర్ ఫిజికల్ గా ఛాలెంజింగ్ గా అనిపించిందని పేర్కొన్నారు. ప్రతీ రోజూ షూటింగ్ కు వెళ్లడానికి రెడీ అవడం కోసం తనకు మూడు గంటలు పట్టేదని, షూటింగ్ కోసం 50 కిలోల నగల్ని ధరించాల్సి వచ్చేదని సోనాక్షి తెలిపారు.

## శంబాల.. శంకరుడి చెమట చుక్క




ఆది సాయి కుమార్ హీరోగా ఉగంధర్ ముని డైరెక్షన్ లో వస్తున్న సూపర్ న్యాచురల్ సినిమా శంబాల. ఈ సినిమాను షైనింగ్ పిక్చర్స్ బ్యానర్ లో రాజశేఖర్ అన్నభిమోజు, మహిందర్ రెడ్డి నిర్మిస్తున్నారు. సినిమాలో ఆది సాయి కుమార్ తో అర్చన అయ్యార్ స్క్రీన్ షేర్ చేసుకుంటుండగా శ్వాసిక, రవి వర్మ, మధునందన్ ఇంపార్టెంట్ రోల్స్ లో నటించారు. టీజర్ తోనే సినిమాపై బజ్ పెరిగేలా చేసుకున్న శంబాల టీం లేటెస్ట్ గా ట్రైలర్ తో ఆడియన్స్ ని సర్ ప్రైజ్ చేశారు. ఈ ట్రైలర్ ని రెబల్ స్టార్ ప్రభాస్ చేతుల మీదుగా రిలీజ్ చేశారు.




## రోషన్ చాంపియన్ టీజర్ ఇంప్రెసివ్

నటుడు శ్రీకాంత్ తనయుడు రోషన్ మేక హీరోగా టాలీవుడ్ కి పరిచయం అయ్యి మంచి సక్సెస్ ని చూసిన సంగతి అందరికీ తెలిసిందే. ఇలా తన నెక్ట్స్ సినిమాగా దర్శకుడు ప్రదీప్ అద్వైతంతో చేస్తున్న భారీ బడ్జెట్ సినిమానే "చాంపియన్". బడా నిర్మాణ సంస్థ వైజయంతి మూవీస్ లాంటి సంస్థ నుంచి వస్తున్న ఈ సినిమా తాలూకా టీజర్ ని ఇప్పుడు మేకర్స్ వదిలారు. మరి ఈ టీజర్ మాత్రం ఇంప్రెసివ్ గా ఉందని చెప్పాలి. రోషన్ మంచి స్పోర్ట్స్ జానర్ కమర్షియల్ సబ్జెక్టుతో వస్తున్నట్టు ఈ టీజర్ లో చూస్తే అర్థం అవుతుంది. వింటేజ్ బ్యాక్ డ్రాప్ అప్పటికి తగ్గ సెటప్ అంతా చూస్తుంటే కొత్త వరల్డ్ క్రియేట్ చేసారని అనిపిస్తుంది. రోషన్ కూడా నటన, తెలంగాణ యాసలో ఆకట్టుకున్నాడు. అలానే మిక్కీ జే మేయర్ స్కోర్ కూడా ఇందులో బాగుంది. ఓవరాల్ గా మాత్రం మంచి ప్రామిసింగ్ టీజర్ ని మేకర్స్ వదిలారు. ఇక ఫుల్ ఫ్లెడ్జ్ సినిమాలో ఏం ప్లాన్ చేశారో చూడాలి.



## జాన్వీ.. పల్లెటూరి మాస్!

పెద్ది సినిమా అంచనాలను నెక్స్ట్ లెవల్‌కు తీసుకెళ్తూ, మేకర్స్ సినిమా నుంచి హీరోయిన్ జాన్వీ కపూర్ ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు. ఈ ఒక్క పోస్టర్‌తో జాన్వీ తన ఇమేజ్‌ను పూర్తిగా మార్చేసేలా కనిపిస్తోంది. జాన్వీ కపూర్ అనగానే మనకు గుర్తొచ్చేది బాలీవుడ్ గ్లామర్, ఫ్యాషన్ ఐకాన్. కానీ 'పెద్ది' కోసం ఆమె చేసిన మేకోవర్ చూసి అందరూ షాక్ అవుతున్నారు. ఇది సింపుల్ డీ గ్లామ్ రోల్ కాదు, పక్కా మాస్ క్యారెక్టర్. శ్రీదేవి కూతురిగా 'అతిలోక సుందరి' ఇమేజ్ ఉన్న జాన్వీ, ఇప్పుడు 'అచ్చియమ్మ'గా పూర్తి మాస్ అవతార్‌లో కనిపించబోతోంది. ఇది ఆమె కెరీర్‌లోనే బిగ్గెస్ట్ ట్రాన్స్‌ఫర్మేషన్. రిలీజ్ చేసిన పోస్టర్ లో, ఓపెన్ టాప్ జీపుపై నిలబడి, జనం మధ్యలో అభివాదం చేస్తున్న లుక్ అదిరిపోయింది. ఆ కట్టుబొట్టు, ఆ సన్ గ్లాసెస్, ఆ బాడీ లాంగ్వేజ్ చూస్తుంటే, ఇది కేవలం హీరో పక్కన పాటలు పాడుకునే హీరోయిన్ పాత్ర కాదని, కథలో చాలా పవర్ ఉన్న రోల్ అని అర్థమవుతోంది. అందుకే మేకర్స్ ఆమె క్యారెక్టర్‌ను "ఫియర్స్ అండ్ ఫియర్‌లెస్" అని పిలుస్తున్నారు.

## దక్షిణాఫ్రికాను తేలిగ్గా తీసుకోం: హర్మన్‌ప్రీత్

వరల్డ్ కప్ ఛాంపియన్ అనిపించుకునేందుకు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న భారత జట్టుకు సువర్ణావకాశం. స్వదేశంలో ట్రోఫీని ముద్దాడే సందర్భం వచ్చేసింది. ఆదివారం ఫైనల్లో దక్షిణాఫ్రికాను ఓడిస్తే విశ్వవిజేతగా టీమిండియా అవతరించనుంది. ఆస్ట్రేలియాను చిత్తు చేసిన ఉత్సాహంతో టైటిల్ పోరులోనూ విజయంపై కన్నేసిన హర్మన్‌ప్రీత్ కౌర్ సేన అంతకంటే ముందు ఒత్తిడిని జయించాల్సి ఉంది. సొంత ప్రేక్షకుల సమక్షంలో బిగ్ ఫైట్‌కు సిద్ధమవుతున్న కెప్టెన్ మీడియా సమావేశంలో తమ వ్యూహం గురించి మాట్లాడింది. అదే సమయంలో సఫారీలను తేలికగా తీసుకోమని ఆమె స్పష్టం చేసింది. 'ప్రపంచ కప్‌ను భారీ ఓటమితో ఆరంభించిన దక్షిణాఫ్రికా ఆ తర్వాత గొప్పగా ఆడింది. వరుస విజయాలతో సెమీస్ చేరుకుంది. మెగా టోర్నీలో సఫారీల ప్రదర్శన అద్భుతమని చెప్పాలి. అంతేకాదు వాళ్లది సమతూకంతో కూడిన జట్టు. పటిష్టమైన బౌలింగ్ దళమే కాదు.. లోయర్ ఆర్డర్లోనూ చెలరేగిపోయే బ్యాటర్లు ఉన్నారు. మా జట్టులోనూ అనేక సానుకూల అంశాలున్నాయి. రేపు జరుగబోయే ఫైనల్ ఆసక్తిగా ఉండనుంది. బిగ్ మ్యాచ్ కోసం మేము మానసికంగా, శారీరకంగా సిద్ధమవుతున్నాం. రేపు మేము గొప్ప ప్రదర్శన చేసి..మ్యాచ్‌ను ఎంజాయ్ చేస్తామని ఆశిస్తున్నా. అయితే.. ముంబై ప్రేక్షకులు ఎంతో మద్దతిస్తున్నారు. స్వదేశంలో వరల్డ్ కప్ ఆడడం అనేది ఎన్నో భావోద్వేగాలతో కూడుకున్నది. అదే సమయంలో..రేపటి మ్యాచ్ మా అందరికి ఎంతో ముఖ్యమైంది. న్యూజిలాండ్, ఆస్ట్రేలియా ఆడినట్టే సమిష్టిగా రాణించాలని భావిస్తున్నాం. అందుకు అవసరమైన ఫోకస్ కోసం డ్రెస్సింగ్ రూమ్‌లో సెషన్స్ నిర్వహించాం. కెప్టెన్‌గా వరల్డ్ కప్ ఫైనల్ ఆడడం నాకు గొప్ప విషయం. చిన్నచిన్న లక్ష్యాలతో ముందుకు సాగితే.. పెద్దవి కూడా సాధ్యమవుతాయి. ఇదే సూత్రాన్ని జట్టు సభ్యులకు చెబుతున్నా' అని పేర్కొంది కౌర్.

## ఫామ్‌లోకి పంత్

### గెలుపు దిశగా టీమిండియా-ఏ

గాయం నుంచి కోలుకున్న రిషభ్ పంత్ ఫామ్ చాటుకున్నాడు. దక్షిణాఫ్రికా ఏ బౌలర్లను ఉతికేసిన అతడు భారత ఏ జట్టును గెలుపు వాకిట నిలిపాడు. బెంగళూరులోని సీఈవో మైదానంలో జరుగుతున్న అనధికారిక టెస్టులో బంతితో తనుష్ కొతియాన్(4-26) ప్రత్యర్థిని దెబ్బకొట్టగా.. పంత్ హాఫ్ సెంచరీ(64 నాటౌట్)తో చెలరేగారు. ఫలితంగా తొలి ఇన్నింగ్స్‌లో పట్టుబిగించే అవకాశాన్ని కోల్పోయిన టీమిండియా రెండో ఇన్నింగ్స్‌లో గొప్పగా పుంజుకొని మ్యాచ్‌ను శాసించే స్థితికి చేరుకుంది. చివరి రోజున మరో 156 పరుగులు



చేస్తే రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో బోణీ కొట్టడం ఖాయం. స్వదేశంలో జరుగుతున్న అనధికారిక టెస్టులో భారత ఏ జట్టు గెలుపు దిశగా సాగుతోంది. తొలి ఇన్నింగ్స్‌లో 70 పరుగుల ఆధిక్యాన్ని సమర్పించుకున్న టీమిండియా.. మూడో రోజు ప్రత్యర్థిని కుప్పకూల్చింది. ఓవర్‌నైట్ స్కోర్ 30/0తో ఇన్నింగ్ ఆరంభించిన దక్షిణాఫ్రికా ఏ జట్టుకు తనుష్ కొతియాన్ (4-26), అన్షుల్ కంభోజ్(3-39)లు షాకిచ్చారు. వీరిద్దరూ హడలెత్తించగా 199కే కుప్పకూలింది. ఓపెన్ లెసెగో సెనొక్వెనె(37), జుబయిర్ హంజా(37)లు టాప్ స్కోరర్లు. కాసేపటికి రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన భారత జట్టు 32కే మూడు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ దశలో క్రీజులోకి వచ్చిన కెప్టెన్ రిషభ్ పంత్(64 నాటౌట్) తనదైన స్టయిల్లో రెచ్చిపోయాడు. అజేయంగా నిలచిన పంత్ నాలుగో రోజు దంచేశాడంతో లంచ్‌లోపే మ్యాచ్ ముగిసే అవకాశముంది.

## టెన్నిస్‌కు బోపన్న రిటైర్మెంట్



ఇండియన్ టెన్నిస్ ప్లేయర్ రోహన్ బొప్పన్న అంతర్జాతీయ టెన్నిస్‌కు అధికారికంగా గుడ్‌బై చెప్పాడు. గ్రాండ్‌స్లామ్ టైటిల్ గెలిచిన నలుగురు భారతీయ ఆటగాళ్లలో అతనొక్కడు. ప్రొఫెషనల్ టెన్నిస్‌కు రిటైర్మెంట్ ప్రకటిస్తున్నట్లు శనివారం రోహన్ బొప్పన్న పేర్కొన్నాడు. టెన్నిస్‌కు వీడ్కోలు పలికిన విషయాన్ని అతను తన ఎక్స్‌లో పోస్టు చేశాడు. దాదాపు రెండు దశాబ్ధాల పాటు అతను టెన్నిస్ కెరీర్‌ను కొనసాగించాడు. 45 ఏళ్ల ఉన్న బొప్పన్న చివరి సారి పారిస్ మాస్టర్స్ ఆడాడు. ఆ టోర్నీలో కజక్ ప్లేయర్‌తో జోడి కట్టాడు. కానీ ఓపెనింగ్ రౌండ్‌లోనే ఆ జంట ఇంటిబాటపట్టింది. రిటైర్మెంట్ సందర్భంగా ఎక్స్ అకౌంట్‌లో భావోద్వేగ పోస్టు పెట్టాడు. ఎ గుడ్‌బై.. బట్ నాట్ ద ఎండ్ అని బొప్పన్న తన జ్ఞాపకాలను రాసుకొచ్చాడు. అఫీషియల్‌గా తన రాకెట్‌ను హ్యాంగ్ చేస్తున్నట్లు ఆ ట్వీట్‌లో పేర్కొన్నాడు. కూర్గ్ నుంచి వచ్చిన తాను ప్రపంచ దేశాల్లో అనేక టోర్నీల్లో ఆడినట్లు తెలిపాడు. ఓల్డేజ్‌లో గ్రాండ్‌స్లామ్ గెలిచిన ఆటగాడిగా బొప్పన్న రికార్డు క్రియేట్ చేశాడు. డబుల్స్ లోనూ వరల్డ్ నెంబర్ వన్ ర్యాంక్ సాధించిన ఓల్డెస్ట్ ప్లేయర్‌గా నిలిచాడు. ఫేర్‌వెల్ పోస్టులో పేరెంట్స్, ఫ్యామిలీ, కోచ్, ట్రైనర్స్‌కు థ్యాంక్స్ తెలిపారు.






# సన్‌డే డబుల్ కిక్

### ఒకే రోజు రెండు టీమిండియా మ్యాచ్‌లు.. ఫైనల్ పోరులో సఫారీతో మహిళా జట్టు ఢీ

### మూడో టీ20లో ఆసీస్‌తో మెన్స్ జట్టు పోరు

ఆదివారం రెండు ఇండియా క్రికెట్ మ్యాచ్ లు ఫ్యాన్స్ కు డబుల్ కిక్ ఇవ్వనున్నాయి. ఇండియా మహిళల వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్ తో పాటు మెన్స్ జట్టు టీ20 మ్యాచ్ ఆడనుంది. ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా ఇండియా మూడో టీ20 మ్యాచ్ ఆడనుంది. ఈ మ్యాచ్ మధ్యాహ్నం 1:45 గంటలకు మ్యాచ్ జరుగుతుంది. టాస్ 1:15 కి వేస్తారు. హెూబర్ట్ వేదికగా బెల్లెరివ్ ఓవల్ స్టేడియం మ్యాచ్ కు ఆతిధ్యమిస్తుంది. మ్యాచ్ జియో హాట్ స్టార్ లో లైవ్ స్ట్రీమింగ్ అవుతుంది.

ఇక లైవ్ టెలికాస్ట్ విషయానికి వస్తే స్టార్ స్పోర్ట్స్ నెట్ వర్క్ లో ప్రత్యక్ష ప్రసారం చూడొచ్చు. 5 మ్యాచ్ ల టీ20 సిరీస్ లో భాగంగా ఇరు జట్ల మధ్య జరిగిన తొలి టీ20 మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. శుక్రవారం (అక్టోబర్ 31) మెల్ బోర్న్ వేదికగా జరిగిన రెండో టీ20లో ఆస్ట్రేలియా 4 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఇరు జట్ల మధ్య మూడో టీ20 ఆదివారం (నవంబర్ 2) జరుగుతుంది. సిరీస్ ఆశలు సజీవంగా ఉండాలంటే ఈ మ్యాచ్ లో టీమిండియా గెలిచి తీరాల్సిందే.

**మధ్యాహ్నం 3:00 గంటలకు వరల్డ్ కప్ ఫైనల్:**

ఆదివారం మహిళల వరల్డ్ కప్ ఫైనల్ లో ఇండియా సౌతాఫ్రికాతో తలపడనుంది. ఈ గ్రాండ్ ఫైనల్ ముంబైలోని డాక్టర్ డివై పాటిల్ స్పోర్ట్స్ అకాడమీలో జరుగుతుంది. మ్యాచ్ మధ్యాహ్నం 3:00 గంటలకు ప్రారంభమవుతుంది. 2:30 గంటలకు టాస్ వేస్తారు. వరల్డ్ కప్ చరిత్రలో ఇప్పటివరకు ఇండియా రెండుసార్లు ఫైనల్లో ఓడిపోయింది. సొంతగడ్డపై ఈ సారి ఎలాగైనా ఫైనల్ గెలవాలని గట్టి పట్టుదలతో కనిపిస్తుంది. 12 సంవత్సరాల సుదీర్ఘ విరామం తర్వాత ఇండియాలో వరల్డ్ కప్ జరగనుండడంతో ఫ్యాన్స్ ఈ సారి మన మహిళల జట్టు ట్రోఫీ గెలుస్తుందని ఆశలు పెట్టుకున్నారు. 2005, 2017 వన్డే వరల్డ్ కప్ లో ఫైనల్ వచ్చినా తుది మెట్టుపై బోల్తా పడింది.

**ఫైనల్ మ్యాచ్: నవీ ముంబై, డివై పాటిల్ స్టేడియం- ఆదివారం**

**సమయం:** మధ్యాహ్నం 3:00 గంటలకు ప్రారంభమవుతుంది. టాస్ 2:30 గంటలకు వేస్తారు.

**లైవ్ టెలికాస్ట్:** స్టార్ స్పోర్ట్స్ నెట్ వర్క్ మూడు వన్డేలను ప్రత్యక్ష ప్రసారం చేస్తుంది.

**లైవ్ స్ట్రీమింగ్:** జియో సినిమా యాప్, వెబ్‌సైట్‌లో ప్రత్యక్ష ప్రసారం అందుబాటులో ఉంటుంది.

## ఫైనల్‌కు వాన ముప్పు

మహిళల వన్డే ప్రపంచ కప్‌లో సరికొత్త అధ్యాయానికి నాంది పడనుంది. దశాబ్దాలుగా ఆధిపత్యం చెలాయిస్తున్న ఆస్ట్రేలియా, ఇంగ్లండ్‌లను తోసిరాజని కొత్త ఛాంపియన్ అవతరించనుంది. ఆ 'కొత్త విజేత ఎవరు?' అని యావత్ క్రీడాభిమానులు ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు. ఈనేపథ్యంలో భారత్, దక్షిణాఫ్రికాల మధ్య ఆదివారం ముంబైలోని డీవై పాటిల్ మైదానంలో టైటిల్ పోరు జరుగనుంది. ఇరుజట్లలో ఎవరు గెలిచినా చరిత్ర సృష్టించడం ఖాయం. సఫారీలకు ఇది తొలి ఫైనల్ కాగా.. టీమిండియాకు మూడోది. రెండుపర్యాయాలు (2005, 2017లో) ఆఖరి మెట్టుపై తడబడిన భారత్ ఈసారి ఎలాగైనా కప్‌ను ఒడిసిపట్టాలనే పట్టుదలతో ఉంది. అయితే.. ఈ బిగ్ ఫైట్‌కు అనుకోని అతిథి వరుణుడు అంతరాయం కలిగించే అవకాశముంది. దాంతో.. 50 ఓవర్ల మ్యాచ్‌పై సందేహాలు నెలకొన్నాయి. ప్రపంచకప్ ట్రోఫీ నిరీక్షణకు తెరదించేందుకు ఎదురుచూస్తున్న భారత్, దక్షిణాఫ్రికా జట్లకు వర్షం షాకిచ్చేలా ఉంది. ఇప్పటికే లీగ్ దశ మ్యాచ్‌లకు పలు దఫాలు అంతరాయం కలిగించి.. కొన్ని మ్యాచ్‌లను రద్దు చేయించిన వరుణుడు.. ఫైనల్ రోజైన ఆదివారం కూడా రెడీగా ఉన్నాడు. ముంబైలో ఆరోజు పడేందుకు 25 శాతం అవకాశముందని భారత వాతావరణ శాఖ తెలిపింది. రాత్రి 8 గంటల వరకూ కూడా వర్ష సూచన 20 శాతంగా ఉందని హెచ్చరించింది. దాంతో.. అంతరాయం కారణంగా కోల్పోయిన సమయాన్ని బట్టి ఓవర్లలో కోత విధించడం వంటివి అంపైర్లు పరిశీలిస్తారు. ఒకవేశ వర్షం కారణంగా 20 ఓవర్ల ఆట అయినా ఆడిస్తారు. అది కూడా సాధ్యం కాకుంటే రిజర్వ్ డేన ఫైనల్ ఆడిస్తారు. సాధ్యమైనంతవరకూ ఆదివారం నాడే మ్యాచ్‌ను నిర్వహించడానికి ప్రయత్నిస్తారు. ఓవర్లు కుదించి అయినా సరే విజేతను తేల్చేందుకు అంపైర్లు కృషి చేస్తారు. వర్షం కారణంగా50 ఓవర్ల ఆటకు అంతరాయం ఏర్పడితే.. ఓవర్లను కుదిస్తారు. అప్పటికీ కూడా ఆట సాధ్యపడకుంటే రిజర్వ్ డేన 50 ఓవర్ల మ్యాచ్ నిర్వహిస్తారు. వర్షం అంతరాయంతో ఓవర్లు తగ్గించి ఆడిస్తారు. అయినా మళ్లీ వరుణుడు అడ్డుపడితే మరుసటి రోజు మిగిలిన ఓవర్ల నుంచి బ్యాటింగ్ జట్టు ఇన్నింగ్స్ ఆరంభిస్తుంది. రిజర్వ్ డేన కూడా వర్షం పడినా.. ఇరుజట్లకు కనీసం 20 ఓవర్లు కేటాయించి ఫలితం రాబడుతారు. ఒకవేళ రిజర్వ్ డేన కూడా వర్షం పడి ఆట సాధ్య పడకుంటే.. ఇరుజట్లను సంయుక్త విజేతలుగా ప్రకటిస్తారు.

## ప్రపంచకప్ గెలిస్తే..!

### మహిళాజట్టుకు బీసీసీఐ భారీ ఆఫర్

మహిళల వన్డే ప్రపంచ కప్ తుది అంకానికి చేరుకుంది. ఆదివారం ముంబయి వేదికగా జరగనున్న ఫైనల్‌లో భారత్‌తో దక్షిణాఫ్రికా తలపడనుంది. ఈ రెండు జట్లు ఇప్పటివరకు టైటిల్ సాధించకపోవడంతో ఈ సారి కొత్త ఛాంపియన్‌ను చూడబోతున్నాం. ఇప్పటివరకు రెండుసార్లు ఫైనల్ చేరినా భారత్ విశ్వవిజేతగా నిలవలేకపోయింది. ఇప్పుడు మూడోసారి అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమవుతోంది. సెమీస్‌లో బలమైన ఆస్ట్రేలియాను ఓడించి ఊపుమీదున్న హర్మన్‌ప్రీత్ సేన.. తుది పోరులోనూ అదే జోరును కొనసాగించి కప్‌ను ఎగరేసుకుపోవాలని అభిమానులు కోరుకుంటున్నారు. భారత అమ్మాయిలు ప్రపంచ కప్ సాధిస్తే.. వారికి భారీ బొనాంజా ఇవ్వాలని బీసీసీఐ యోచిస్తోందని సమాచారం. భారత పురుషుల జట్టు 2024 టీ20 ప్రపంచ కప్ గెలిచినప్పుడు ఆటగాళ్లు, సహాయక సిబ్బందికి కలిపి బీసీసీఐ రూ.125 కోట్ల ప్రైజ్‌మనీని అందించింది. ఒకవేళ హర్మన్‌ప్రీత్ సేన విశ్వవిజేతగా నిలిస్తే అంతే మొత్తంలో నజరానా ప్రకటించాలని బోర్డు డిసైడ్ అయినట్లు తెలుస్తోంది.

## హైదరాబాద్‌కు మెస్సీ

అర్జెంటీనా ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీ త్వరలో హైదరాబాద్‌కు రానున్నారు. డిసెంబర్‌లో భారత్‌లో పర్యటించనున్న ఆయన.. దేశంలోని ప్రధాన నగరాల్లో సందడి చేయనున్నారు. దక్షిణాదిన తొలుత కేరళలో పర్యటించాలని అనుకున్నప్పటికీ ఆ వేదిక రద్దు కావడంతో లియోనెల్ మెస్సి కార్యక్రమాన్ని హైదరాబాద్‌కు మార్చాలని నిర్వాహకులు నిర్ణయించారు. ఇందుకోసం ఏర్పాట్లు చేస్తున్నారు. భారత్ పర్యటనలో భాగంగా కోల్‌కతా, హైదరాబాద్, ముంబయి, న్యూఢిల్లీ నగరాల్లో మెస్సి సందడి చేయనున్నారు. దక్షిణాదిలో ఉన్న లక్షలాది మంది ఫుట్‌బాల్ అభిమానుల కోసం హైదరాబాద్‌లో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు భారత్‌లో మెస్సి పర్యటన నిర్వహకుడు సతాద్రు దత్తా వెల్లడించారు. వారం రోజుల్లో బుకింగ్‌లు ప్రారంభమవుతాయన్నారు. అయితే, వేదిక మాత్రం గచ్చిబౌలి లేదా రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియంలో ఉంటుందన్నారు.



## ఆర్‌సీబీకి స్మృతి మందాన గుడ్‌బై?

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) మహిళల జట్టు కెప్టెన్ స్మృతి మంధాన ఆ జట్టును వీడనుందా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. తాజాగా సోషల్ మీడియా వేదికగా ఆర్‌సీబీ షేర్ చేసిన పోస్ట్ ఈ సందేహాలకు కారణమైంది. శనివారం(నవంబర్ 1) కన్నడ రాజ్యోత్సవం పురస్కరించుకొని ఆర్‌సీబీ ఒక వీడియోను షేర్ చేసింది. ఆర్‌సీబీ స్టార్ ఆటగాళ్లంతా ఒక్కొక్కరిగా వచ్చి కన్నడ రాజ్యోత్సవ శుభాకాంక్షలు చెప్పారు. ఆర్‌సీబీ స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ, కెప్టెన్ రజత్ పటీదార్, శ్రేయాంక పాటిల్, దేవదత్ పడిక్కల్, టీమ్ డేవిడ్, భువనేశ్వర్ కుమార్, జితేష్ శర్మ కర్ణాటక ప్రజలకు రాష్ట్ర ఏర్పాటు దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. మహిళల టీమ్ నుంచి శ్రేయాంక పాటిల్ మాత్రమే విషెస్ చెప్పడంతో కెప్టెన్ స్మృతి మంధాన జట్టును వీడుతుందనే సందేహాలు మొదలయ్యాయి. కానీ స్మృతి మంధాన మహిళల వన్డే ప్రపంచకప్ 2025 టోర్నీతో బిజీగా ఉంది. దాంతోనే ఆమె ఆర్‌సీబీ ఫ్రాంచైజీకి అందుబాటులోకి రాలేదనే విషయం అర్థమవుతుంది. స్మృతి మంధానతో పాటు మరే ఇతర ఆర్‌సీబీ మహిళా క్రికెటర్ కూడా ఈ వీడియోలో కనిపించలేదని, ప్రధాన ఆటగాళ్లంతా ప్రపంచకప్ టోర్నీ ఆడుతున్నారని ఆర్‌సీబీ ఫ్యాన్స్ కామెంట్ చేస్తున్నారు. గాయంతో భారత జట్టుకు దూరమైన శ్రేయాంక పాటిల్ ఖాళీగా ఉండటంతోనే ఈ వీడియో చేసిందని అభిప్రాయపడుతున్నారు. ఆర్‌సీబీకి కోహ్లీ ఎంతనో.. స్మృతి మంధాన కూడా అంతేనని, ఆమె ఎప్పుడూ ఈ జట్టుతోనే ఉంటుందని కామెంట్ చేస్తున్నారు.



ఈవార్తలు ప్రజావాణి

సంపాదకీయం

నేటి ఈవార్తలు

ఆదివారం 2-11-2025 | www.evarthalu.com



గత ఆరు నెలల్లో అలాగే ముఖ్యంగా పోయిన నెలరోజుల్లో దేశం ఎదుర్కొన్న సమస్యలు స్వాతంత్ర్య ఉద్యమం సమయంలో కూడా భారత్ ఎదుర్కొని ఉండదు. 78 ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో, ప్రపంచ ఆర్థిక శక్తిగా ఎదుగుతున్న భారతదేశంలో, ప్రపంచానికి ఔషదాలు అందిస్తున్న భారతదేశంలో, ప్రపంచానికి వస్త్రాలు అందిస్తున్న భారతదేశంలో గత ఆరు నెలల్లో ఎదుర్కొన్న సమస్యలు ఎప్పుడూ ఎదుర్కొలేదు కానీ మొదటిసారిగా ఎదుర్కొని నిలబడింది. దేశాన్ని విచ్చిన్నం చేయాడానికి విదేశీ శక్తులు ఎప్పటి నుండో ఎదురుచూస్తున్నాయి. విదేశీ శక్తులకు స్వదేశీ శక్తులు తమ పాలన కోసం రాజకీయ అనిశ్చితి తీసుకురావాలనే ప్రయత్నంలో దేశంలో అల్లర్లు, ఉద్యమాలు, ర్యాలీలు ఇలా అనేక ప్రయత్నాలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. ఆపరేషన్ సిందూర్ తర్వాత అమెరికా టారిఫ్ లతో మొదలయిన పంచాయితీ నేటి ఐపీఎస్ ఆఫీసర్ ఆత్మహత్య వరకు ప్రతి అవకాశాన్ని కాంగ్రేస్, కమ్యునిస్ట్, అలాగే విదేశీ శక్తుల సమర్థనలు, విదేశీ పత్రికలు అన్నీ భారత్ పై విషం చిమ్ముతున్నాయి.

# విదేశీ కుట్రలు



## ఒక్కో కుట్ర ఇలా..

1. 12 అక్టోబర్ 2025న జైపూర్, రాజస్థాన్‌లో నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా (ఎన్ఎస్‌యూఐ) 400–500 మందితో పెద్ద సభ నిర్వహించి ర్యాలీ చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు వినోద్ జాఖర్ , ఇతర కాంగ్రెస్ విద్యార్థి నాయకులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అసలు వాళ్లని అరెస్ట్ చేసింది ఎందుకంటే రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఉత్సవంపై దాడి చేసినందుకు అరెస్ట్ అయ్యారు. కానీ ఆర్.ఎస్.ఎస్ ని బ్లేమ్ చేస్తూ ఒక పెద్ద ఎత్తున ర్యాలీ చేశారు, అల్లర్లు చేయాలని ప్రయత్నం చేశారు అయినప్పటికీ విఫలమయ్యారు.

2. 11 అక్టోబర్ 2025న యూత్ కాంగ్రెస్ అస్సాం మొత్తం పెద్ద ఎత్తున ర్యాలీలను నిర్వహించింది. నల్బరీ , నాగావ్‌లో కలిసి సుమారు 8,000–10,000 మందితో టార్చ్‌లైట్ ప్రాసెషన్‌లు , బైక్ ర్యాలీలతో కూడిన ప్రదర్శనలు నిర్వహించారు. అసలు ర్యాలీకి కారణం ప్రసిద్ధ అస్సామీ గాయకుడు జుబీన్ గార్గ్ యొక్క మిస్టీరియస్ మరణానికి కారణం చెప్పాలని డిమాండ్ చేస్తూ నిర్వహించబడ్డాయి. కానీ ప్రభుత్వం ఇప్పటికే ట్రాన్స్‌పరెంట్ ఇన్వెస్టిగేషన్ చేస్తుంది. ఆ ర్యాలీని అస్సాం ప్రభుత్వం సింపుల్ గా క్లోజ్ చేసింది. నిజం ఏమిటంటే జుబిన్ గార్గ్ సింగపూర్ లో స్క్యూబా డైవింద్ చేస్తూ అదుపుతప్పి దుర్మరణం పాలయ్యాడు.

3. 11 అక్టోబర్ 2025న హర్యానా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ, అధ్యక్షుడు రావు నరేంద్ర సింగ్ ఆద్వర్యంలో అన్ని జిల్లాల్లో రాష్ట్ర వ్యాప్తంగా ర్యాలీలు, సభలు నిర్వహించింది. ఈ ర్యాలీలు, సభలు ఐపీఎస్ అధికారి పురాన్ కుమార్ సూసైడ్ కి నిరసన తెలుపుతూ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఈ సమస్యను దలిత ఆప్రెషన్ కేస్‌గా మలిచింది. హర్యానా రాష్ట్ర అడ్మినిస్ట్రేషన్‌లో జరుగుతున్న ఆధిపత్య దోరణిని హర్యానా ప్రభుత్వం అణచివేసింది. అలాగే కాంగ్రెస్ గి గట్టి సమాదానం చెప్పింది.

4. 11-12 అక్టోబర్ 2025న ఆమ్ ఆద్మీ పార్టీ ఢిల్లీలో అనేక ప్రదేశాల్లో ర్యాలీలు, సభలు నిర్వహించింది. పటేల్ నగర్‌లో 400-500 పాల్గొన్నవారితో పార్టీ చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా బి.ఆర్. గవాయ్ పై షూ విసిరిన ఘటనను నిరసిస్తూ ఈ ర్యాలీ చేసింది. వాస్తవానికి కాంగ్రేస్ 60 పై బడిన పాలనలో జడ్జిలపై ఎన్నో దాడులు జరిగాయి. కానీ దీనినే హైలెట్ చేస్తూ అదే కాంగ్రెస్, ఆప్ లు దీనిని సనాతన ధర్మానికి లింక్ చేస్తూ హిందూ ధర్మానికి వ్యతిరేకంగా ఈ ర్యాలీలు చేయడం శోచనీయం. జడ్జి గారు దానిని వ్యక్తిగత దాడిగానే పరిగణించి కిశోర్ గారిని మన్నించారు, న్యాయవ్యవస్థ కు జరిగిన అవమానం గా వారు పరిగణించలేదు.

5. అదే ఢిల్లీ లో 11 అక్టోబర్ 2025న కాంగ్రెస్ దేశ వ్యాప్తంగా సీజేఐపై దాడి ఘటనను ఐపీఎస్ అధికారి పురాన్ కుమార్ సూసైడ్ ను నిరసిస్తూ పిలుపిచ్చింది. ఢిల్లీలో రాజేంద్ర పాల్ గౌతం , లక్నోలో అజయ్ రాయ్ వంటి నాయకుల నేతృత్వంలో, పార్టీ రెండు ఈవెంట్‌లను దళితులకు జరిగిన అన్యాయంగా ప్రొజెక్ట్ చేస్తూ ఈ ర్యాలీలు నిర్వహించింది. అయినప్పటికీ ఎక్కడా గొడవలు, అల్లర్లు జరగకుండా ప్రభుత్వం పూర్తిస్థాయిలో పనిచేసింది. అలాగే అక్టోబర్ 8 న పట్నా, కురుక్షేత్ర, , గురుగ్రామ్ లో వందలాది మందితో నిరసనలు చేసింది. ఈ అంశం పై దేశ వ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసనల ప్రయత్నం చేసింది, కానీ ప్రజలకు వాస్తవాలు తెలియడం మూలాన ఎక్కడా అల్లర్లు కాలేదు.

6. 10 అక్టోబర్ 2025న ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డ్ , మజ్లిస్ చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద ర్యాలీని నిర్వహించింది. 200-300 మంది పాల్గొన్న డెమాన్‌స్ట్రేషన్, ఇటీవల పాస్ అయిన వక్ఫ అమెండ్‌మెంట్ యాక్ట్‌కు వ్యతిరేకంగా ఈ గ్రూప్‌లు ముస్లిం కమ్యూనిటీ ప్రాపర్టీలు , హక్కులపై పోరాటం చేయాలని పెద్ద ఎత్తున నిరసనలు జరిగాయి కానీ ప్రభుత్వం ఎటువంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తపడింది.

7. 10 అక్టోబర్ 2025న ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుడు రాజుభాయ్ కర్వడా, గుజరాత్‌లో బోటాడ్‌లో అగ్రికల్చరల్ ప్రొడ్యూస్ మార్కెట్ కమిటీ బయట 8,000–10,000 మందితో పెద్ద ర్యాలీ ని రైతుల పేరుతో నిర్వహించారు, రాష్ట్రంలో అగ్రికల్చరల్ మార్కెటింగ్ , రైతుల వెల్ఫేర్‌కు సంబంధించిన లాంగ్‌స్టాండింగ్ ఇష్యూలను కావాలని ప్రచారం చేసింది. వాస్తవాలు వేరేలా ఉన్నాయి. అలాగే ఈ పదివేల మంది రైతులు కాదని చూసిన వారందరికీ తెలుసు గనుక ఏ ఒక్కరూ పెద్దగా స్పందించలేదు.

8. అక్టోబర్ 9, 10 తేదీల్లో లెఫ్ట్-లీనింగ్ స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఎఫ్ఐ) ఢిల్లీ యూనివర్సిటీ లో ప్రో-పాలస్తీనా ర్యాలీని నిర్వహించింది. 100-150 మంది విద్యార్థులు పాల్గొన్నారు, ఇతర విద్యార్థులతో గొడవలకు దారితీసింది. ఢిల్లీ పోలీస్ గొడవలు చేసిన వారిని గుర్తించి అరెస్ట్ చేసింది. విశ్వవిద్యాలయం 8 మందిని డిటెయిన్ చేసింది. ముంబైలో అజాద్ మైదాన్ వద్ద కూడా ప్రో పాలిస్తీనా అంటూ పాలిస్తానాకు మద్దతు తెలిపారు. మలప్పురం లో ఇదే రోజుల్లో ప్రో పాలిస్తీనా అంటూ ర్యాలీలు, సభలు నిర్వహించారు.

9. అక్టోబర్ 9, 2025న యునైటెడ్ లెఫ్ట్ పార్టీల కోలిషన్ ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద సభ నిర్వహించింది. 1,000–2,000 వ్యక్తుల పాల్గొన్నారు, పాలస్తీనాకు మద్ధతుగా ర్యాలీలు నిర్వహించింది.

10. 08 అక్టోబర్ 2025న అస్సాం యొక్క ఆరు టీ-ట్రైబ్ కమ్యూనిటీలు, ఏటీటీఎస్ఏ , ఏఏఎస్ఏఏ లీడ్ చేసిన, తిన్సుకియాలో సభలు, ర్యాలీలు చేశారు. హుకాన్ పుఖురి ప్లేగ్రౌండ్ వద్ద సుమారు 2-3 లక్ష మంది పాల్గొన్నారు, స్కెడ్యూల్డ్ ట్రైబ్ స్టేటస్, ల్యాండ్ ఓనర్‌షిప్ హక్కులు, , ప్లాంటేషన్ వర్కర్‌ల జీతాల పెంపును డిమాండ్ చేస్తూ ఈ ర్యాలీని చేశారు. 3 లక్షల మంది పాల్గొన్న వారిని బిశ్వ శర్మ కేర్ ఫుల్ గా హ్యాండిల్ చేశారు.

11. 08 అక్టోబర్ 2025న ప్రాయగ్రాజ్, ఉత్తరప్రదేశ్‌లో, డాక్టర్ అశిష్ మిత్తల్ నేతృత్వంలో ర్యాలీలి నిర్వహించబడ్డాయి. 40–50 మంది మాత్రమే పాల్గొన్నారు, లడాఖ్ యాక్టివిస్ట్ సోనం వాంగ్‌చుక్ విడుదలను డిమాండ్ చేస్తూ ఈ నిరసనలు జరిగాయి.

12. **08 అక్టోబర్ 2025న ఎన్ఎస్‌యూఐ ఢిల్లీ , పలు నగరాల్లో ర్యాలీలు, సభలు నిర్వహించింది. రాయ్ బరేలీలో ఒక మర్డర్‌పై నిజాలు తేలలంటూ ఈ ర్యాలిలు చేస్తే రెండు గ్రూప్‌ల మధ్య గొడవలు జరిగాయి. చివరకు దీనికి దళిత్ కార్డ్ వాడేసింది. చిన్న చిన్న గ్రూప్ లతో స్ట్రీట్ కార్నర్ మీటింగ్ లు జరిగాయి. దీనిపై పెద్ద ప్రచారం జరగలేదు.**

13. 08 అక్టోబర్ 2025 న సిగ్నిఫికెంట్ షో ఆఫ్ పొలిటికల్ ఫోర్స్‌లో, సీపీఎం తమిళనాడు, చెన్నైలో ప్రో–గాజా ర్యాలీని నిర్వహించింది. ఈవెంట్ చీఫ్ మినిస్టర్ ఎం.కె. స్టాలిన్ , 5,000–7,000 సపోర్టర్‌లతో హాజరయ్యారు. స్టాలిన్ భారత్‌కు పాలస్తీనాకు హ్యూమానిటేరియన్ ఎయిడ్‌ను అందించాలని, సెంట్రల్ గవర్నమెంట్‌ను యుద్ధాన్ని ఆపడానికి సహాయం చేయాలని కోరారు. ప్రభుత్వమే ఈ ర్యాలీ నిర్వహించడం మూలాన ఎటువంటి అల్లర్లు జరగలేదు.

14. 07 అక్టోబర్ 2025న హైదరాబాద్‌లో ధర్నా చౌక్ వద్ద ప్రో పాలస్తీనా మద్దతు సభ నిర్వహించబడింది. ఈవెంట్ 500-700 మంది పాల్గొన్నారు. ఈ నిరసన ఆందోళగా మారి పోలిసులు కేంద్ర బలగాలు అదుపుచేశాయి.

15. 07 అక్టోబర్ 2025ఢిల్లీలో టార్గెటెడ్ గా ర్యాలీలు, 50–100 ఆప్ వర్కర్లు సీజేఐపై చెప్పు విసిరిన ఘటనకు నిరసనగా 72-సంవత్సరాల లాయర్ హౌస్‌ను చుట్టుముట్టారు.

16. 07 అక్టోబర్ 2025న ఎన్ఎస్‌యూఐ మధ్యప్రదేశ్, భోపాల్‌లో 800-1,000 నర్సింగ్ స్టూడెంట్స్ ఒక పెద్ద ర్యాలీ నిర్వహించారు. స్టూడెంట్స్ 13 నర్సింగ్ కాలేజీలు డీరికగ్నైజ్డ్ చేయడం మూలాన ఈ ర్యాలీ నిర్వహించారు. మీకు తెలుసు నర్సింగ్ కాలేజీల పరిస్థితి. అలాగే జైపూర్ రాజస్తాన్ లో ఇటువంటి నర్సింగ్ రిలేటెడ్ ఇష్యూస్ ని తెలిపే నిరసనలు.

17. 06 అక్టోబర్ 2025న చత్తీస్‌గఢ్, రాయగఢ్‌లో, హస్దేవ్ అరన్యా బచావో సంఘర్ష్ సమితి 800–1,000 మందితో ర్యాలీని నిర్వహించింది. గారే పాల్మా 1 కోల్ బ్లాక్‌ను జిందల్ కంపెనీకు అలాకేట్ చేయడానికి వ్యతిరేకంగా ,, ఫారెస్ట్ రీజియన్‌లో ఆన్‌గోయింగ్ ఎన్విరాన్‌మెంటల్ , డిస్‌ప్లేస్‌మెంట్ కన్‌సర్న్‌లకు వ్యతిరేకంగా ఇది నిర్వహించారు. వాస్తవాలు అల్లర్లు, గొడవలు సృష్టించడం.

18. 05 అక్టోబర్ 2025 న దేశ వ్యాప్తంగా జరిగినా గాజా సపోర్ట్ ర్యాలీలలో భాగంగా హైదరాబాద్‌లో ధర్నా చౌక్ వద్ద గాజా సపోర్ట్ ధర్నా నిర్వహించబడింది. %దీణూ% ఇండియా ఇది ఆర్గనైజ్డ్ చేసింది. ఈ ఈవెంట్ లో 500-600 పాల్గొన్నారు. ఢిల్లీ, ముంబై, , కోల్‌కతా వంటి ఇతర మేజర్ ఇండియన్ సిటీల్లో పెద్ద ఎత్తున జరిగాయి.

19. 05 అక్టోబర్ 2025న హైదరాబాద్‌లో మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ వద్ద, ముస్లిం స్టూడెంట్స్ "ఐ లవ్ మహ్మద్" క్యాంపెయిన్ కింద 100–150 మందితో ర్యాలీ నిర్వహించారు. పాల్గొన్నవారు క్యాంపెయిన్ సపోర్ట్‌లో స్లోగన్‌లు ఎత్తుతూ కనిపించారు, క్యాంపస్‌పై రెలిజియస్ సెంటిమెంట్‌ను ప్రతిబింబిస్తూ, అల్లర్లు చేయాలనే దోరణితో సాగింది. పోలీస్ కేంద్ర బలగాలు అదుపుచేశాయి.

20. 05 అక్టోబర్ 2025న సిందేగాలో క్రిస్టియన్ కమ్యూనిటీ సభ్యులు 1,000-2,000 మందితో సభ నిర్వహించారు. కారణం ఇటీవల చర్చ్ , క్రిస్టియన్ రెలిజియస్ లీడర్‌పై దాడులకు వ్యతిరేకంగా, అథారిటీల నుండి ప్రొటెక్షన్ , జస్టిస్‌ను డిమాండ్ చేశారు.

21. 05 అక్టోబర్ 2025న %దీణూ% ఇండియా , ఇండియన్ పీపుల్ ఇన్ సాలిడారిటీ విత్ పాలస్తీనా ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద మేజర్ ర్యాలీని నిర్వహించాయి. ఈ ఈవెంట్ లో 2,000 మంది పాల్గొన్నారు, పాలస్తీనా కోసం కోఆర్డినేటెడ్ గా పెద్ద ఎత్తున ఇదే రోజు అనేక ర్యాలీలు జరిగాయి.

22. సెప్టెంబరు 11 నుండి ఇలా సోనమ్ వాంగ్ చుక్ కి మద్దతుగా, గాజా కీ మద్ధతుగా, సీజేఐకి మద్దుతుగా, నర్సింగ్ కాలేజీల విషయంలో, ఐపీఎస్ ఆఫీసర్ విషయంలో, ఐ లవ్ మహ్మద్, వక్ఫ బోర్డు, ఇలా అనేకానేక కారణాలతో బీహార్ సరిహద్దు రాష్ట్రాల వెంబడి అనేక ర్యాలీలు నిర్వహించి, సభలు పెట్టి ప్రతిదాన్ని ఒక నేషనల్ ఇష్యూలుగా చిత్రీకరించారు.

ఈ ర్యాలీల ముఖ్య ఉద్దేశ్యం దేశం లో రాజకీయ అనిశ్చితి తీసుకువచ్చి, ప్రభుత్వాలను అస్థిరపరచడం. ఏది ఏమయినప్పటికీ భారత జెన్–జీని మాత్రం మెచ్చుకోవాల్సిందే ఢిల్లీ, హెచ్‌సీయూ విశ్వవిద్యాలయాలలో జాతీయవాద విద్యార్థి సంఘాలను గెలిపించుకున్నాయి. అలాగే మరోకవైపు దేశ వ్యాప్తంగా అడ్డంకులు సృష్టించినప్పటికీ ఆరెస్సెస్ తన శతాబ్ది ఉత్సవాలలో భాగంగా దసరా ఉత్సవాలను, రూట్ మార్చ్ లను చేస్తూ దేశ ప్రజల్లో పంచ పరివర్తనకు శ్రీకారం చుట్టింది. అలాగే దేశ ప్రజలూ వీరిని స్వాగతించారు, సంఘటిత జాతీయ శక్తి ముందు విదేశీ శక్తులకు వంతపాడిన దేశ ద్రోహుల ఆటలు ఈ ఆరు నెలలుగా అడ్డుకట్టపడుతూనే ఉన్నాయి.



**సుమంత్ పెండెం**

ఏబీవీపీ సౌత్ సెంట్రల్ జోన్ సోషల్ మీడియా కన్వీనర్

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.